సీట్ బెల్ట్ .. ప్రాణదాతే..

-వాహన ప్రయాణాల్లో వినియోగం తప్పనిసరి
-అసౌకర్యం అనుకుంటే ప్రాణాలకే ముప్పు
-ప్రమాదాల సమయంలో కీలక పాత్ర

హైదరాబాద్, డిసెంబరు 3,ప్రభాతవార్త: "యాక్సిడెంట్ అంటే ..బైకో ,కారో రోడ్డుమీద పడిపోవడం కాదు..ఒక కుటుంబం మొత్తం రోడ్డున పడిపోవడం "ఒతెలుగు సినిమా డైలాగ్ ఇది. కానీ ఇందులో జీవితం ఉంది. రోడ్డుప్రమాదంలో కుటుంబ పెద్దప్రాణాలు కోల్పోతే ..మొత్తం కుటుంబమే అనాథ అవుతుంది. అందుకే ..రోడ్డెక్కామంటే గమ్యం చేరేవరకు అప్రమత్తంగా ఉండాల్సినదే.. కానీ చాలామంది అంతులేని నిర్లక్ష్యం వహిస్తుంటారు. చిన్నసీటుబెట్లు ప్రాణాన్ని కాపాడుతుందని.. కుటుంబాన్ని రోడ్డున పడకుండా ఆపుతుందని తెలిసినా లైట్ తీసుంటారు. వాస్తవవానికి మోటారు వాహన చట్ట నిబంధనల ప్రకారం ద్విచక్రవాహనదారులు హెల్మెంట్..కార్ల ఇతర వాహనాలను నడిపేవారు సీటు బెల్ట్ ధరించడం తప్పనిసరి. కానీ ఎక్కడ చూసినా ఈనిబంధనలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. నగరాల్లో ప్రయాణిస్తున్నప్పుడు వాహనదారులు ట్రాఫిక్ పోలీసుల జరిమానాలకు భయపడి సీట్‌బెల్ట్ ధరిస్తున్నా హైవేలపై ప్రయాణాల్లో మాత్రం సీట్‌బెల్ట్‌పెట్టుకోవడం లేదు. కొన్ని సందర్భాల్లో డ్రైవింగ్ సీట్లో కూర్చునేవారు మినహా వారు వాటిని ఉపయోగించట్లేదు. సీట్‌బెల్ట్ ధరించకపోతే అలారం మోగేలా కార్ల తయారీ కంపెనీలు సాంకేతికను అభివృద్ధి చేశాయి. దీన్ని తప్పించుకోవడానికి చాలామంది సీట్‌బెల్ట్ బకెల్‌ను దాని సాకెట్‌లో పెట్టి బెల్ట్‌ను మాత్రం తమకు,సీటుకు మధ్య ఉంచుతున్నారు. అయితే ఈబకెల్స్ ద్వారా అలారం మోగకుండా ఆపినా ప్రమాదం జరగకుండా ఆపలేమని పోలీసులు అంటున్నారు.

సీటుబెల్ట్ ధరించకుంటే..

నిర్ణీత వేగంతో వెళ్తున్న కారులో ప్రయాణికులు స్థిరంగా కూర్చున్నప్పటికీ వాహనం దేన్నయినా గద్దుకున్నా లేదా హఠాత్తుగా వేగాన్ని కోల్పోయినా అందులోని వారు అదేవేగంతో ముందుకు వెళ్తారు. ఫలితంగా ముందుసీటు, వెనక సీట్లలో కూర్చున్న వారు అద్దం తదితరాలను అత్యంత వేగంగా ఢీకొంటారు. ఒక్కోసారి వాహనం పల్టీకొడితే అద్దాల్లోంచి లేదా డోర్ ఊడిపోతే అందులోంచి బయటకు ఎగిరిపడతారు. ఫలితంగా తల, ముఖం, తదితర చోట్ల తీవ్ర గాయాలై మరణిస్తుంటారు.

సీటుబెల్ట్ ధరిస్తే..

సీటు బెల్ట్ ధరించి ప్రయాణిస్తున్నప్పుడు ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొన్నా లేదా కారు పల్టీలు కొట్టినా ఒక్కసారిగా బ్రేక్ వేయాల్సి వచ్చినా ప్రయాణికులు వాహనంలోంచి ఎగిరిపడకుండా కాపాడుతుంది. ముఖ్యంగా ప్రయాణికులు డ్యాష్‌బోరుడ్డు లేదా ముందుసీటన్లకు గుద్దుకోకుండా సీట్‌బెల్ట్ వ్యతిరేక శక్తిని ప్రయోగిస్తుంది. ఫలితంగా ప్రయాణికులు మృత్యువాత పడకుండా కేవలం గాయాలతో బయటపడే అవకాశం ఎక్కువగా ఉంది.

ఒక్కోసారి ఎయిరబ్యాగ్స్ ఉన్నా...

అత్యాధునిక భద్రతా ప్రమాణాలు ఉండే కార్లు సైతం కొన్ని సందర్భాలలో ప్రయాణికుల ప్రాణాలు కాపడలేవని నిపుణులు చెబుతున్నారు. మితిమీరిన వేగమే అందుకు కారణమని విశ్లేషిస్తున్నారు. కొన్ని ప్రమాదాల్లో ఎయిర్ బ్యాగ్స్ స్పెన్సర్లు యాక్టివేట్ అయ్యి ,తెరుచుకోవడానికి కొంత సమయం పడుతుందని..సాధారంగా ఇది 0.05 సెకన్లుగా ఉంటుందని పేర్కొంటున్నారు వాహనం మితిమీరిన వేగంతో ఉన్నప్పుడు ఈసమయంలోపే డ్రైవర్ స్టీరింగ్ వరకు, పక్కసీట్‌లో ఉన్నవారు డాస్‌బోర్డు వరకు ప్రయాణించి బలంగా ఢీకొట్టడం జరగుతుందని వివరిస్తున్నారు.

వెనక కూర్చునే వారఉ మినహాయింపు కాదు..

గతంతో పోలిస్తేకార్లలో సీటుబెల్టు ధరించడం గురించి అవగాహన పెరిగింది. అయితే అది ముందుసీట్లో కూర్చున్న వాళ్లకే పరిమితమవుతమవుతుంది. వెనక సీట్లో కూర్చునే వారికి తమకు నిబంధనలు వర్తించవని ఫీల్‌అవుతారు. 2022లో నిర్వహించిన ఓసర్వేలో వెనకవైపు ఉండే ప్రయాణికులను సర్వే చేయగా ..7శాతం మందే సీటుబెల్ట్ ధరిస్తున్నట్లు వెల్లడైంది. ఇటీవల లోకల్ సర్కిల్స్ అనే సంస్థ సర్వేలో భాగంగా వేలమందిని ఆరా తీయగా ..70శాతంమంది వెనకవైపు ఉండే వాళ్లు సీటుబెల్ట్ "ధరించే లే"అని చెప్పడం గమనార్హం. వాస్తవానికి కేంద్ర మోటార్ వాహన నిబంధనల్లో 138(3) నిబంధన కింద వెనుక సీట్లో కూర్చునేవారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాల్సిందే. లేదంటే వెయ్యి రూపాయలు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. దురదృష్టవశాత్తు దీనిగురించి అవగాహన ఉన్నవారు అంతంత మాత్రమే. అందుకే ముందు సీటు ప్రయాణికులతోపాటు వెనక సీట్లకు కూడా సీట్‌బెల్ట్ బీప్ వ్యవస్థను తప్పనిసరి చేయాలని ప్రభుత్వం యోచిస్తుంది.

హైదరాబాద్ వార్త



27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు
జిహెచ్ఎంసిలో విలీనం

-ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
-రికార్డులు స్వాధీనం చేసుకునే బాధ్యత డిప్యూటీ కమిషనర్లకు
-మానిటరింగ్ ఆఫీసర్లుగా జోనల్ కమిషనర్‌లకు బాధ్యతలు

హైదరాబాద్,డిసెంబరు 3,ప్రభాతవార్త: జీహెచ్ఎంసీ విస్తరణ ప్రక్రియ పూర్తి అయింది. జీహెచ్ఎంసీ విస్తరణపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు జీహెచ్ఎంసీలో విలీనం చేసినట్లు ఉత్తర్వులు ఇచ్చింది. నిన్నటి నుంచి అమల్లోకి వచ్చినట్లు నోటిఫికేషన్ జారీ చేసింది. విలీనమైన మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల రికార్డుల స్వాధీనానికి ఉత్తర్వులు జారీ చేసింది. రికార్డులు స్వాధీనం చేసుకునే బాధ్యత డిప్యూటీ కమిషనర్లు, జోనల్ కమిషనర్లకు అప్పగించింది. స్థానిక సంస్థలకు సంబంధించిన ఆస్తులు, ఆదాయం, విస్తీర్ణం, వ్యయం, అప్పులు, రెవెన్యూ సరిహద్దులు, సర్కారు ఆఫీసులు ఇతరాత్ర అంశాలకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకునేందుకు, ఈ స్వాధీనం చేసుకునే ప్రక్రియను ప్రత్యేకంగా పర్యవేక్షించేందుకు ఒక్కో యూఎల్‌బీ (అర్బన్ లోకల్‌బాడీ)కి ఇద్దరు అధికారులను నియమిస్తూ కమిషనర్ ఆ ఆదేశాలు జారీ చేశారు. వీరిలో రికార్డులను స్వాధీనం చేసుకునే బాధ్యతలను డిప్యూటీ మున్సిపల్ కమిషనర్లకు అప్పగించగా, స్వాధీనం చేసుకునే ప్రక్రియను మానిటరింగ్ చేసే విధులను జోనల్ కమిషనర్ స్థాయి ఉన్నతాధికారులకు అప్పగిస్తున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఈ రకంగా మొత్తం 27 యూఎల్‌బీలకు రికార్డులు స్వాధీనం చేసుకునేందుకు 27 మంది డిప్యూటీ మున్సిపల్ కమిషనర్లు (డీఎంసీ) లను, అలాగే ప్రక్రియను మానిటరింగ్ చేసేందుకు ఆయా యూఎల్ బీలకు సమీపంగా ఆరు జోన్లలో విధులు నిర్వహిస్తున్న ఆరుగురు జోనల్ కమిషనర్లు (జెడ్సీ)లను 27 యూఎల్‌బీల రికార్డుల స్వాధీనం మానిటరింగ్ బాధ్యతలను అప్పగిస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణ స్థానిక సంస్థల వారీగా నియమితులైన ఈ అధికారులు ఒక్కో యూఎల్ బీకి సంబంధించిన రికార్డులను పంచనామా చేసి స్వీకరించి, స్వీకరించినట్లు యూఎల్ బీ అధికారులకు రసీదును కూడా జారీ చేయనున్నారు.

సంఖ్య	- యుఎల్‌బి	-విలీనం చేసుకునే అధికారి-	మానిటరింగ్ అధికారి
1.	పెద్ద అంబర్‌పేట్	-జీహెచ్ఎంసీ సర్కిల్ నెం.3,	డీఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్
2.	జల్ పల్లి	-జీహెచ్ఎంసీ సర్కిల్ నెం.8,	డీఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్
3.	శంషాబాద్	-జీహెచ్ఎంసీ సర్కిల్ నెం.11,	డీఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్
4.	తుర్కయంజాల్	-జీహెచ్ఎంసీ సర్కిల్ నెం.7,	డీఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్
5.	మణికొండ	-జీహెచ్ఎంసీ సర్కిల్ నెం. 13,	డీఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్
6.	నార్సింగి	-జీహెచ్ఎంసీ సర్కిల్ నెం.12,	డీఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్
7.	ఆదిబట్ల	-జీహెచ్ఎంసీ సర్కిల్ నెం. 6,	డీఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్
8.	తుక్కుగూడ	-జీహెచ్ఎంసీ సర్కిల్ నెం.4,	డీఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్
9.	మేడ్చల్	-జీహెచ్ఎంసీ సర్కిల్ నెం. 27,	డీఎంసీ కూకట్ పల్లి జోనల్ కమిషనర్
10.	దమ్మాయిగూడ	-జీహెచ్ఎంసీ సర్కిల్ నెం.1,	డీఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్
11.	నాగారం	-జీహెచ్ఎంసీ సర్కిల్ నెం. 28,	డీఎంసీ సికిందరాబాద్ జోనల్ కమిషనర్
12.	పోచారం	-జీహెచ్ఎంసీ సర్కిల్ నెం. 15,	డీఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్
13.	ఘట్కేసర్	- జీహెచ్ఎంసీ సర్కిల్ నెం. 2,	డీఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్
14.	గుండ్లపోచంపల్లి	-జీహెచ్ఎంసీ సర్కిల్ నెం. 19,	డీఎంసీ కూకట్ పల్లి జోనల్ కమిషనర్
15.	తూంకుంట	-జీహెచ్ఎంసీ సర్కిల్ నెం.29,	డీఎంసీ సికిందరాబాద్ జోనల్ కమిషనర్
16.	కొంపల్లి	-జీహెచ్ఎంసీ సర్కిల్ నెం. 25,	డీఎసీ కూకట్ పల్లి జోనల్ కమిషనర్
17.	దుండిగల్	-జీహెచ్ఎంసీ సర్కిల్ నెం. 26,	డీఎంసీ కూకట్ పల్లి జోనల్ కమిషనర్
18.	బొల్లారం	-జీహెచ్ఎంసీ సర్కిల్ నెం.21,	డీఎంసీ కూకట్ పల్లి జోనల్ కమిషనర్
19.	తెల్లాపూర్	-జీహెచ్ఎంసీ సర్కిల్ నెం.20,	డీఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్
20.	అమీన్ పూర్	-జీహెచ్ఎంసీ సర్కిల్ నెం.22,	డీఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్
21.	బడంగ్ పేట	-జీహెచ్ఎంసీ సర్కిల్ నెం.9,	డీఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్
22.	బండ్లగూడ జాగీర్	- జీహెచ్ఎంసీ సర్కిల్ నెం. 17,	డీఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్
23.	మీర్ పేట	-జీహెచ్ఎంసీ సర్కిల్ నెం. 5,	డీఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్
24.	బొడుప్పల్	-జీహెచ్ఎంసీ సర్కిల్ నెం.16,	డీఎంసీ సికిందరాబాద్ జోనల్ కమిషనర్
25.	ఫీర్జాదిగూడ	-జీహెచ్ఎంసీ సర్కిల్ నెం.14,	డీఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్
26.	జవహర్ నగర్	-జీహెచ్ఎంసీ సర్కిల్ నెం.30,	డీఎంసీసికిందరాబాద్ జోనల్ కమిషనర్
27.	నిజాంపేట	-జీహెచ్ఎంసీ సర్కిల్ నెం.24,	డీఎంసికూకట్ పల్లి జోనల్ కమిషనర్

విద్య,గృహ రుణాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వండి

-బ్యాంక్ అధికారుల సమావేశంలో కలెక్టర్ హరిచందన దాసరి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచంద దాసరి తదితరులు

హైదరాబాద్,డిసెంబరు 3,ప్రభాతవార్త: జిల్లాలోని విద్య, గృహ రుణాలకు బ్యాంక్ అధికారులు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీసీసీ, డిఎల్ఆర్‌సి సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్షిక ప్రణాళిక ప్రకారం ఇచ్చినటువంటి టార్గెట్ ను సంపూర్ణంగా అమలు చేయాలని బ్యాంక్ అధికారులను ఆదేశించారు. అదేవిదంగా కొన్ని బ్యాంకుల పర్ఫామెన్స్ చాలా తక్కువగా ఉన్నదని మూడో త్రైమాసిక సమావేశం వరకు మెరుగువరుచుకోవాలని సూచించారు. సైబర్ నేరాలకు మోసపోకుండా ప్రజలు,వృద్ధులకు సదస్సుల ద్వారా అవగాహన కల్పించాలని అలాగే బ్యాంక్ అధికారులు పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాలోని అకౌంట్ లేని విద్యార్థులకు జీరో అకౌంట్ కు అన్ని బ్యాంకులు సహకరించాలని బ్యాంక్ అధికారులకు సూ చించారు. జిల్లా వార్షిక ఋణ ప్రణాళిక 2025-26 ప్రకారం వివిధ రంగాలలో రూ. 420682 .07 కోట్లు రుణాల లక్ష్యం ఉండగా, రెండవ త్రైమాసింలో (సెప్టెంబర్ 2025) రూ.. 253493 .19 కోట్లు (60.26)రుణాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇందులో ఎంఎస్ఎంఈ రుణాల లక్ష్యం రూ.. 115649.26 కోట్లు ఉండగా, రూ.. 57312.17 కోట్లు (48.56) మంజూరు చేయటం జరిగిందని, అలాగే ప్రాధాన్యత రంగ రుణాల లక్ష్యం రూ. 121798.10 కోట్లు ఉండగా, రూ. 65827.73 కోట్లు (54.05) మంజూరు చేయటం జరిగిందని తెలిపారు. ప్రణాళిక ప్రకారం వివిధ ఋణాలు మంజూరు చేయుచున్నందుకు బ్యాంకర్స్‌ని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్బిఐ ఎల్డిఓ రెహమాన్, నాబార్డ్ డిడిఎం హర్ష రఘురామ్, ఎల్ డి యం నరసింహ మూర్తి,వివిధ వాణిజ్య,సహకార ఆర్ఆర్‌బి బ్యాంకుల కంట్రోలర్స్,జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

నేటి పాఠశాల విద్యార్థులే ..రేపటి వ్యవసాయ శాస్త్రవేత్తలు

-వ్యవసాయ వర్సిటీ ఉపకులపతి అల్దాస్ జానయ్య

అత్తాపూర్ డిసెంబరు3,ప్రభాతవార్త : రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో స్వతంత్ర భారత తొలి రాష్ట్రపతి మరియు వ్యవసాయ శాఖ మంత్రి భారతరత్న డా. రాజేంద్రప్రసాద్ జయంతిని పురస్కరించుకొని వ్యవసాయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జయశంకర్ తెలంగాణ వ్యవసాయ వర్సిటీ ఉపకులపతి డా. అల్దాస్ జానయ్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, వ్యవసాయంలోని వివిధ కోణాలను విద్యార్థులకు పరిచయం చేయడం ద్వారా వ్యవసాయం యొక్క ఔచిత్యాన్ని తెలియచేయటం ద్వారా విద్యార్థులను వ్యవసాయ రంగం వైపు ఆకర్షించడం మరియు పాఠశాల విద్య తర్వాత వ్యవసాయ మరియు అనుబంధ రంగాలలో వృత్తిని ఎంచుకోవడం తద్వారా భారతదేశ అభివృద్ధిలో వ్యవసాయరంగం యొక్క ప్రాముఖ్యతను ఇనుమడింపచేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. పాఠశాల పాఠ్యాంశాలలో ప్రస్తుతం ఉన్న జీవశాస్త్రంతో పాటు వ్యవసాయం మరియు ఆహార శాస్త్రాలకు సంబంధించిన ఒక సబ్జెక్టుగా ఉండాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. అనంతరం కార్యక్రమంలో ఏర్పాటు చేసిన వివిధ విభాగాలకు సంబంధించిన స్టాళ్లను పరిశీలించి వారిని అభినందించారు.కార్యక్రమంలో వ్యవసాయ వర్సిటీ రిజిస్ట్రార్ డా. విద్యాసాగర్, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డా. ఝాన్సీరాణి, పిజి డీన్ డా. ఈశ్వరి, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. గోవర్ధన్, వివిధ విభాగాల అధిపతులు, ప్రభుత్వ పాఠశాల, శివరాంపల్లి రాజేంద్రనగర్, ఆదర్శ విద్యాలయ హై స్కూల్, భానోదయ హై స్కూల్, ఏషియా గ్రామర్ స్కూల్, రవి బ్రిలియంట్ స్కూల్, శ్రీ గాయత్రి హై స్కూల్, సిల్వర్ డేల్ ది స్కూల్, విశ్వశాంతి గ్రామర్ స్కూల్, భవాని మోడల్ హై స్కూల్, జాస్మిన్ హై స్కూల్, లిటిల్ ఏంజెల్ హై స్కూల్, శ్రీ గౌతమ్ హై స్కూల్, వెస్ట్ సైడ్ గ్రామర్ స్కూల్, టిని స్కాలర్ హై స్కూల్, కృషి హై స్కూల్, భారతీయ విద్యా భవన్, హ్యాపీ స్కాలర్స్, విద్యా భారతి, ఆరిజిన్ స్కూల్, స్ప్రింగ్ డేల్స్, ఆరాధన ది స్కూల్, ఎండి మెమోరియల్ హైస్కూల్, న్యూ బ్రిలియంట్ హై స్కూల్ నుండి విచ్చేసిన విద్యార్థులు వ్యవసాయ వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి

ఆల్ ఇండియా సూఫీ ఉలమా కౌన్సిల్ నేతల డిమాండ్

ధర్నాలో నినాదాలు చేస్తున్న ఆల్ ఇండియా సూఫీ ఉలమా కౌన్సిల్ నాయకులు

ధర్నాచౌక్, డిసెంబర్ 3, ప్రభాతవార్త: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను తక్షణమే అమలుచేయాలని ఆల్ ఇండియా సూఫీ ఉలమా కౌన్సిల్ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఆల్ ఇండియా సూఫీ ఉలమా కౌన్సిల్ ఆధ్వర్యంలో, మౌసాన్‌లకు జీతభత్యాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కేసీఆర్ మౌలానాలకు 4 వేల నుంచి 5 వేల వరకు భత్యాన్ని ఇచ్చారని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే మసీదులలో ప్రార్థనలు చేసే మౌలానాలకు 12వేలు భత్యంగా ఇస్తామని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయాలని, లేనిపక్షం రాబోయే రోజుల్లో పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో కౌన్సిల్ అధ్యక్షులు సూఫిఖైరుద్దీన్, ప్రతినిధులు మీర్ ఇనాయత్‌అలీ బక్రీ, అన్వరుద్దీన్, ఫరాతుల్లా షరీఫ్, ప్రొఫెసర్ అన్వర్‌ల్లాఖాన్, రంగారెడ్డి, మెదక్, హైదరాబాద్ జిల్లాల నుంచి మౌలానాలు, సభ్యులు పాల్గొన్నారు.

అగ్నివీర్ పాసింగ్ అవుట్ పరేడ్

పాసింగ్ అవుట్ పరడ్‌లో అగ్నివీర్‌లు

అల్వాల్, డిసెంబరు 3 ప్రభావార్త: జంటనగరాలులో కొలువు తీరి ఉన్న రక్షణశాఖ విభాగాలులో శిక్షణ పూర్తి చేసుకున్న అగ్నివీర్‌లకు సంబంధించిన పాసింగ్ అవుట్ పరడ్‌లు అట్టహాసంగా జరిగాయి. సికింద్రాబాద్‌లోని ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్, 1 ఇఎంఇ సెంటర్, మెహిదీపట్నంలోని ఆర్టిలరీ సెంటర్‌లులో పరడ్‌లు జరిగాయి. శిక్షణ పూర్తి చేసుకున్న 2629 మంది యువ అగ్నివీర్‌లు దేశంలోని రక్షణ విభాగాలులో విధులులో చేరునున్నారు.

ముమ్మరంగా రోడ్ సేఫ్టీడ్రైవ్

-నగరవ్యాప్తంగా 21,786 గుంతలు పూడ్చివేత

హైదరాబాద్, డిసెంబరు 3,ప్రభాతవార్త: గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా ట్రాఫిక్ జామ్ లు లేకుండా, నగర పౌరుల ప్రయాణం సజావుగా జరిగేలా చూసేందుకు ఉద్దేశించిన రోడ్డు సేఫ్టీ డ్రైవ్ ముమ్మరంగా సాగుతుంది. రోడ్డు భద్రత చర్యలలో భాగంగా గుంతల పూడ్చివేత పనులు, క్యాచ్ పిట్ రిపేర్‌లు, రోడ్ల మరమ్మత్తు పనులు, ప్యాచ్ వర్క్ పనులు, కవర్ రీప్లేస్‌మెంట్‌లు, సెంట్రల్ మీడియన్ మరమ్మతులు నిరంతరంగా కొనసాగుతున్నాయి. కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఆదేశాల మేరకు మేరకు జీహెచ్ఎంసీ మెయింటెన్స్ చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్ క్షేత్ర స్థాయిలో డ్రైవ్ ను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. డిసెంబర్ 3 వ తేదీ నాటికి నగరంలో మొత్తం 23,058 గుంతలు గుర్తించడం జరిగింది.వాటిలో 21,786 గుంతలకు మరమ్మతులు చేయడం జరిగింది. ఇప్పటి వరకు 1,032 క్యాచ్ పిట్స్ రిపేర్‌లు, 495 కవర్ రీప్లేస్‌మెంట్‌లు, 13 సెంట్రల్ మీడియన్ మరమ్మతులు పూర్తి అయ్యాయి.

జోన్ల వారీగా వివరాలు: ఎల్.బి.నగర్ జోన్‌లో 3,888 గుంతను, చార్మినార్ జోన్‌లో 2,885 ,ఖైరతాబాద్ జోన్‌లో 3,785, శేరిలింగంపల్లి జోన్‌లో 2,731 ,కూకట్‌పల్లి జోన్‌లో 3,258, సికింద్రాబాద్ జోన్‌లో 5,239 మొత్తం 21,786 గుంతలను పూడ్చడం జరిగింది.

అదుపుతప్పి బీభత్సం సృష్టించిన టిప్పర్

-రోడ్డు డివైడర్‌ని ఢీ కొట్టి..లారీని ఢీ కొట్టిన వైనం

రోడ్డు డివైడర్‌ని కొట్టి లారీని ఢీ కొట్టిన దృశ్యం

మలక్ పేట, డిసెంబర్ 3, ప్రభాతవార్త: బ్రేకులు ఫెయిల్ అయి అదుపు తప్పిన టిప్పర్ వాహనం బీబీత్సం సృష్టించిన సంఘటన మలక్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి కథనం ప్రకారం ఆస్మాన్ ఘాడ్ లో మట్టిని నింపుకొని వస్తున్న టిప్పర్ వాహనం (నెంబర్ ఏపీ 29 డబ్ల్యు 0044) ముసారాంబాగ్ రోడ్డు వద్దకు రాగానే బ్రేక్స్ ఫెయిల్ అయి అదుపుతప్పి రోడ్డు డివైడర్ ఢీకొనడంతో పాటు అవతల వైపు రోడ్డు వైపు ప్రయాణిస్తున్న లారీ (నెంబర్ టీఎస్ 08యుజె 1170)ని డీ కొట్టడంతో లారీ వెళ్లి మధిర డిపో ఆర్టీసీ బస్సు (నెంబర్ టిఎస్04జడ్0281)ని, కారును ఢీకొట్టడం జరిగింది. ఈ సంఘటనలో బస్సు వెనక అద్దాలు పగిలాయి. సమాచారం తెలియడంతో మలక్ పేట పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదం మూలంగా మలక్ పేట నుంచి దిల్ షుక్ నగర్ వరకు భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఈ మేరకు ఇన్ స్పెక్టర్ పిడమర్తి నరేష్ ఆధ్వర్యంలో ఎస్సై రాజశేఖర్ రెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారిపై లైంగిక దాడి

- బాధితురాలి పెద్దమ్మ, సహాయ దర్శకుడు, కెమెరామెన్ అరెస్ట్

ఫిలింనగర్, డిసెంబరు 3, ప్రభాతవార్తః ఫిలింనగర్‌లో బాలికపై లైంగిక దాడి కేసులో పోలీసులు ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఈ కేసులో బాధితురాలి పెద్దమ్మతోపాటు, ఒక సహాయ దర్శకుడు, కెమెరామెన్‌లు నిందితులుగా ఉన్నారు. ఫిలింనగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఫిలింనగర్‌లో నివసించే మాచా అరుణ(33)కు సినీ పరిశ్రమలో కో డైరక్టర్‌గా పనిచేసే బండి వెంకట శివారెడ్డి (43), కెమెరామెన్ పెనికెలపాటి అనిల్ (40)తో పరిచయం ఉంది. ఈ క్రమంలోనే తన సోదరి కుమార్తెకు సినిమా అవకాశాలు కల్పిస్తామంటూ నమ్మించి పెద్దమ్మ వెంకట శివారెడ్డి, అనీల్ వద్దకు తీసుకెళ్లింది. కాగా బాలిక పెద్దమ్మ సాయంతో వారిద్దరు ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డారు. ఇంటికి వచ్చిన బాధితురాలు విషయాన్ని తన కుటుంబ సభ్యులకు తెలియజేసింది. వారు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులైన అరుణతోపాటు వెంకటశివారెడ్డి, అనీల్‌లను అరెస్ట్ చేశారు. బీఎన్ ఎస్‌లోని పలు సెక్షన్లతోపాటు పోక్సో చట్టంలోని 7 రెడ్ విత్ 8, 9 రెడ్ విత్ 10, 17 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పశ్చిమ మండల డీసీపీ చింతమనేని శ్రీనివాసరావు తెలిపారు. వారి నుంచి మూడు సెల్‌ఫోన్లను స్వాధీ నం చేసుకున్నట్లు తెలిపారు. డిసెంబరు 2న ముగ్గురు నిందితులను అదుపు లోకి తీసుకున్నామని, విచారణలో వారు నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. నిందితుల నుంచి మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సినిమా, టీవీ అవకాశాల పేరుతో మోసగించే వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల ని, ఎవరైనా ఇలాంటి ప్రలోభాలకు గురైతే వెంటనే స్థానిక పోలీసులకు సమా చారం అందించాలని డీసీపీ ప్రజలను కోరారు.

ఇగ్నో విసి ఆచార్య ఉమా కాంజిలాల్‌కు ప్రొ.జి.రామ్ రెడ్డి ఎక్సలెన్స్ అవార్డు

జూబ్లీహిల్స్, డిసెంబరు 3, ప్రభాతవార్తః

దూర విద్యా విధానంలో దేశవ్యాప్తంగా అత్యుత్తమ సేవలు అందించినందుకుగాను 2025 సవత్సరానికి ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో) వీసీ ప్రొ.ఉమా కాంజిలాల్ కు ప్రొ.జి.రామ్ రెడ్డి ఎక్సలెన్స్ అవార్డు అందించనున్నట్లు డా. బి. ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ప్రొ. ఘంటా చక్రపాణి తెలిపారు. డిసెంబర్ 4న అంబేద్కర్ వర్సిటీ ప్రాంగణంలో జరిగే ప్రొ. జి. రాంరెడ్డి జయంతి వేడుకల్లో ఈ అవార్డును ప్రధానం చేయనున్నట్లు వెల్లడించారు. డా. బీ. ఆర్. అంబేద్కర్ ఓపెన్ యునివర్సిటి, ప్రొ.జి.రామ్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్, సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో దూర విద్యా వ్యాప్తికి ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ ప్రతీ సంవత్సరం ప్రొ. రాం రెడ్డి పేరున ఈ అవార్డును దూర విద్యలో విశేష సేవలు అందిస్తున్న వారికి అందించనున్నట్లు వీసీ ప్రొ. ఘంటా చక్రపాణి వెల్లడించారు. 4న(గురు వారం) విశ్వవిద్యాలయం లో నిర్వహించనున్న స్మారకోపన్యాస కార్య క్రమానికి అస్సాం ఓపెన్ యూనివర్సిటీ వీసీ ప్రొ. రాజేంద్ర ప్రసాద్ దాస్ ముఖ్య అతిథిగా హాజరై స్మారకోపన్యాసం చేయనున్నట్లు తెలిపారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

అయ్యప్ప పడి పూజలో పాల్గొన్న స్వాములు..

ఫిలింనగర్, డిసెంబరు 3, ప్రభాతవార్తః

జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని వినాయకనగర్ పర్వతాంజనేయస్వామి ఆలయంలో కొలువుదీరిన శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం కె.పురుషోత్తం గురుస్వామి ఆధ్వర్యంలో 18వ పడిపూజా మహోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. వందలాది మంది అయ్యప్ప స్వాముల శరణుఘోషతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది. అయ్యప్ప భజన పాటలు, భక్తిగీతాలు ఆలపిస్తూ అయ్యప్ప స్వాములతోపాటు వినాయకనగర్ బస్తీవాసులు భక్తి శ్రద్ధలతో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సన్నిధానం గురుస్వాములు సన్నిధానం గురుస్వాములు బాబు రావు, రామకృష్ణారెడ్డి, సాయి రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖాన ఏర్పాటు చేస్తాం : కార్పొరేటర్

శాంతి యువజన సంఘం బస్తీలో బస్తీ దవాఖాన భవనం ఏర్పాటు చేయాలని కోరుతూ గాంధీనగర్ కార్పొరేటర్ ఏ .పావని వినయ్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న శాంతి యువజన బస్తీ నాయకులు ఈద సాయి

చిక్కడపల్లి డిసెంబర్ 3 ప్రభాతవార్త : గాంధీనగర్ డివిజన్ లోని శాంతి యువజన సంఘం బస్తీలోని స్థానికుల విజ్ఞప్తి మేరకు ఖాలి స్థలంలో బస్తీ దవాఖాన భవనం ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని స్థానిక కార్పొరేటర్ ఏ .పావని వినయ్ కుమార్ హామీ ఇచ్చారు. బుధవారం బస్తీ వాసులు కార్పొరేటర్ ను కలిసి బస్తీ దవాఖాన భవనం ఏర్పాటు చేయాలని కోరుతూ శాంతి యువజన బస్తీ నాయకులు ఈద సాయి నేతృత్వంలో వినతి పత్రాన్ని అందజేశారు. సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ, సంబంధిత జి హెచ్ ఎం సి ఉన్నతాధికారులతో చర్చించి, బస్తీ నాయకులు, స్థానికుల కోరిక మేరకు బస్తీ దవాఖాన భవనం ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక కృషి చేస్తామని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు వి.నవీన్ కుమార్, బిజెపి నేతలు ఆనంద్ రావు, సాయి కుమార్, నీరజ్, తరుణ్, జ్ఞానేశ్వర్, శాంతి యువజన బస్తీ నాయకులు ఈద సాయి, ఎస్.రాజు, పెంటయ్య, గణేష్, వేణు, శివ కుమార్, హరినాథ్, నూరుద్దీన్, షాబుద్దిన్, మురళీ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి కిలో వెండి విరాళం

వెండిని విరాళంగా అందజేస్తున్న ఆలయ ధర్మకర్త హరీశ్ కుటుంబ సభ్యులు

చిక్కడపల్లి డిసెంబర్ 3 ప్రభాతవార్త

వివేక్ నగర్ లోని ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి కిలో వెండిని విరాళంగా ఆలయ ధర్మకర్త హరీశ్ కుటుంబ సభ్యులు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయం పునర్ నిర్మాణ చైర్మన్ జానకీ సుధాకర్, ఈఓ దేవ నాథం మాట్లాడుతూ.. దేవాలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావడం హర్షణీయమని అన్నారు. ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు పూర్తి చేశారని అన్నారు. దేవాలయంలో సుందరకాండ ఘట్టాలకు వెండి తాపడం చేయిస్తున్నామని తెలి పారు. దీని కోసం దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ గంగంరవి, ఆలయ కమిటీ సభ్యులు నెల్లి శ్యాముదిరాజ్, నీతురాణి, శ్రీలక్ష్మీగణపతి ఆలయం కమిటీ సభ్యులు బండారు నవీన్, అర్చకుడు బుగ్గ లక్ష్మీపతి శర్మ, అర్చకులు కందాళ వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో అర్చకుల సమస్యలు పరిష్కరించుకోవాలి

మహాసభలో పాల్గొన్న అర్చకులు,ఉద్యోగులు

బేగంబజార్,డిసెంబర్ 3ప్రభాతవార్త: ఐక్యతతో అర్చకుల సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేయాలని టి.జి.ఓ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు.తెలంగాణ అర్చక,ఉద్యోగుల,మలిదశ జిఐఏ సాధన సమితి రాష్ట్ర స్థాయి సమావేశం బొగ్గులకుంటలోని తెలంగాణ సరస్వతపరిషత్తులో జరిగింది.ఈ సమావేశంలో తెలంగాణ అర్చక,ఉద్యోగుల జె.ఎ.సి చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ కొనసాగింది ఏలూరి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ తెలంగాణ అర్చక జె.ఎ.సి గ్రాంటెడ్ ఇన్ ఎయిడెడ్ సమస్యను పరిస్కరించే దిశగా కృషి చేస్తామని హామి ఇచ్చారు.అర్చకులు లేకుంటేదేవాలయాల మనుగడ కష్టమన్నారు.తమ సమస్యల పరిష్కారం కోసం వీధి పోరాటలకుసైతం సిద్ధమవుతున్నామని తెలిపారు.ఉద్యోగుల జిఐఏ సాధన కోసం రాజీలేని పోరాటం చేస్తామన్నారు.తెలంగాణ అర్చక ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కాండూరి కృష్ణమాచారి,జె.ఎ.సి కన్వీనర్ రవీంద్రచార్యులు,బద్రీనాథ్‌చార్యులు,అగ్నిహోత్రం చంద్రశేఖరశర్మ, వరదరాజుస్వామి,రాజేశ్వరశర్మ,సత్యనారాయణశర్మ,ఆనందశర్మ,పి.విఆర్ శర్మ,గట్టుశ్రీనివాసచార్యులు,తంగువరపు ప్రసాద్‌శర్మ,మాడభూషిణి నాగరాజు,ముకుందాచారి,దురిశెట్టి విద్యాసాగర్‌శర్మలతోపాటు తెలంగాణ జిల్లాలోనివివిధ అర్చకులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు : ఎమ్మెల్యే నవీన్ యాదవ్

జూబ్లీహిల్స్, డిసెంబరు 3, ప్రభాతవార్తః

దివ్యాంగులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ అన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా మా ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్(మిష్), రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మెయినాబాద్ సంయుక్తంగా కేబీఆర్ పార్కు నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు బుధవారం అవగాహన నడకను నిర్వహించారు. ఈ అవగాహన వాక్‌ను ప్రారంభించిన నవీన్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వంతోపాటు ప్రైవేట్ రంగాల్లో దివ్యాంగులకు సాధారణ వ్యక్తులతో సమాన అవకాశాలను కల్పించాలని ఆయన కోరారు. పారాఒలింపిక్‌లో పలువురు తమ ప్రతిభను ప్రపంచానికి చాటుతున్నారని అన్నారు. ఒలంపిక్ స్థాయిలోనూ పతకాలు సాధిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో రక్షణాత్మక ఉద్యోగ భర్తీలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మిష్ వ్యవస్థాపకురాలు సునీత జి. కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులను సమాజంలో తక్కువ చేసి చూడవద్దని, వారికి కూడా సమాన హక్కులు ఉంటాయని అన్నారు. వారికి స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ సంస్థలు స్కిల్ డెవపల్‌మెంట్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. ఇటువంటి కార్యక్రమాల వల్ల వారిలో కొత్త ఉత్సాహం నెలకొని మరింత ఉత్సాహంగా పని చేస్తారని సూచించారు. ఈ కార్యక్రమంలో మిష్ విద్యార్థులు, వినికిడి సమస్యతో బాధపడుతున్న చిన్నారులు, వారి తల్లిదండ్రులు ,ఆడియాల జీ విద్యార్థులు, మిష్ అధ్యాపకులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, చిత్రంలో సునీత జి కుమార్ తదితరులున్నారు.

సిఐటియు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ 2కె రన్

చిక్కడపల్లి డిసెంబర్ 3 (ప్రభాతవార్త) : ఈనెల డిసెంబర్ 7 8 9 తేదీలలో మెదక్ పట్టణంలో జరుగు సిఐటియు తెలంగాణ రాష్ట్ర ఐదవ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సుందరయ్య పార్క్ నుండి 2కె రన్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిఐటియు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ జెండా ఊపి 2 కే రన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులను యజమాన్యాలకు బానిసలుగా మార్చే లేబర్ కోడ్లు తీసుకొచ్చిన ఈ సందర్భంలో సిఐటియు మహాసభలు జరుగుతున్నాయన్నారు. కేవలం కార్పొరేట్లు పెట్టుబడిదారుల ప్రయోజనం మాత్రమే లేబర్ కోట్ల ఉద్దేశం అన్నారు. లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా కార్మికులను సన్నద్ధం చేసేందుకు ఈ మహాసభల లో చర్చలు జరుగుతాయి అన్నారు. డిసెంబర్ 7వ తేదీన మెదక్ పట్టణంలో జరిగే భారీ కార్మిక బహిరంగ సభను తెలంగాణ రాష్ట్రంలోని అశేష కార్మిక వర్గం జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శులు పద్మశ్రీ ఎం వెంకటేష్ శ్రీకాంత్ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎం దశరథ్, జె.కుమారస్వామి, నగర కోశాధికారి కే అజయ్ బాబు,నగర నాయకులు శ్రీ మల్లేష్ జి నరేష్ శ్రీనివాస్ అజయ్ బాబు, పి మల్లేష్ సుందరయ్య పార్క్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి వాకర్స్ క్లబ్ సెంట్రల్ గవర్నర్ శైలజ మాజీ అధ్యక్షులు రమేష్ రెడ్డి హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం కార్యదర్శి వీరయ్య శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

సిఐటియు తెలంగాణ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ 2కే రన్ నిర్వహించిన దృశ్యం

నటుడు రామశాస్త్రికి చాట్లశ్రీరాములు ప్రతిభా పురస్కారం : డా. కె.వి.రమణాచారి

నాంపల్లి, డిసెంబరు 3 ప్రభాతవార్త : ప్రఖ్యాత సాంస్కృతిక సంస్థ రసరంజని, చాట్ల శ్రీరాములు థియేటర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సుప్రసిద్ధ రంగస్థల ప్రయోక్త డా. చాట్ల శ్రీరాములు 94వ జయంతి వేడుకలను ప్రముఖ రంగస్థల నటుడు ఎన్.ఎస్.రామశాస్త్రికి ప్రతిభా పురస్కారం ప్రదానం చేయనున్నట్లు రసరంజని అధ్యక్షుడు, అవార్డు ఎంపిక కమిటీ సభ్యుడు డా. కె.వి.రమణాచారి తెలిపారు. ఈమేరకు కార్యక్రమ ఆహ్వానపత్రికను ఆవిష్కరించి వివరాలు తెలిపారు. నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదిక 5వ తేదీ శుక్రవారం రాత్రి 6.30గంటల నుండి విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణ సభాధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ఆంధ్ర నాటక కళాపరిషత్ అధ్యక్షుడు బొల్లినేని కృష్ణయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆత్మీయ అతిథులు ప్రముఖ రంగస్థల ప్రయోక్త, దర్శకుడు డిఎస్ ఎన్.మూర్తి, డా. డి.విజయభాస్కర్, చాట్ల వెంకటరమణ తదితరులతో కలిసి ప్రముఖ రంగస్థల నటుడు ఎన్.ఎస్. రామశాస్త్రిని ఘనంగా సత్కరించి ప్రతిభా పురస్కారం, 20వేల రూపాయల నగదు బహుమతిని ప్రదానం చేస్తారని వివరించారు. నాటకమే తపస్సుగా భావించే నాటక రంగ నిత్యసత్య కృషీవలులకు చంద్రుడికో నూలుపోగుగా సత్కారంచేసి గౌరవించాలన్న సంకల్పంతోనే ఆవిర్భవించిన చాట్ల శ్రీరాములు ట్రస్టు 1999 నుండి క్రమం తప్పకుండా ప్రతీ యేటా డిసెంబరు 5న ఒక నాటకరంగం విశిష్టనకు ప్రతిభా పురస్కారంతోపాటు 20వేల రూపాయలు ప్రదానంచేసే శిష్య సంప్రదాయాన్ని నెలకొల్పి ఎందరికో చాట్ల శ్రీరాములు మార్గదర్శకులయ్యారని రమణాచారి పేర్కొన్నారు. సభకు ముందు శ్రీజయా ఆర్ట్స్ హైదరాబాద్ వారిచే మాడభూషి దివాకరబాబు రచన, బి.సాదినేని దర్శకత్వంలో రూపొందిన వన్‌ప్లస్ వన్ నాటిక ప్రదర్శింపబడుతుందని, అధిక సంఖ్యలో రంగస్థలప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి కార్యక్రమాన్ని ఆస్వాదించి జయప్రదం చేయాలని కోరారు.

డబ్ల్యూటిఐటిసి ఇంటర్నేషనల్ స్టూడెంట్ చాప్టర్ జాయింట్ సెక్రటరీగా రాహుల్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 3,ప్రభాతవార్త:

దుబాయ్ ప్రపంచ తెలుగుసమాచార సాంకేతిక మండలి (డబ్ల్యూటీఐటీసీ) ఇంటర్నేషనల్ స్టూడెంట్ చాప్టర్ జాయింట్ సెక్రటరీగా చుక్కా రాహుల్ రెడ్డి నియమితులయ్యారు. విద్య, వ్యవస్థాపకత, ఆవిష్కరణ ,క్రీడ రంగాల్లో రాహుల్ రెడ్డి చూపిన ప్రతిభ, నాయకత్వ గుణాలు ఈ బాధ్యతకు ఆయనను అర్హుడిగా నిలబెట్టాయని డబ్ల్యూటిఐటిసి చైర్మన్ సందీప్ మక్తాల తెలిపారు. జాతీయ స్థాయి క్రికెటర్ పేరు సంపాదించిన రాహుల్ రెడ్డి, వోక్సెన్ యూనివర్సిటీలో పలు నాయకత్వ బాధ్యతలు నిర్వహించారని ఎంటర్ప్రిన్యూర్షిప్ డెవలప్మెంట్ కోచైర్పర్సన్, ట్రేడ్ టవర్ ఇన్నోవేషన్ సెంటర్ స్టూడెంట్ హెడ్, టిఆర్వై ఎంటర్‌ప్రెన్యూర్షిప్ ఆపరేషన్స్ హెడ్ వంటి పదవుల్లో పనిచేస్తూ యువతలో ఆవిష్కరణా భావనను పెంపొందించే కార్యక్రమాల్లో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని విద్యతో పాటు క్రీడల్లోను రాణిస్తూ క్రమశిక్షణ, టీమ్ వర్కు నిలదీసే ప్రతిరూపంగా నిలుస్తున్నారన్నారు. రాహుల్ రెడ్డి గ్లోబల్ తెలుగు విద్యార్థి సమూహానికి కొత్త తరం ప్రతినిధి అని అన్నారు. ఆవిష్కరణ, వ్యవస్థాపకత పట్ల ఆయనకున్న అంకితభావం విద్యార్థులను ప్రోత్సహించే తన ఆలోచనలతో కలిసి డబ్ల్యూటిఐటిసికి మరింత బలం చేకూరుస్తుందని చెప్పారు. కాగా దుబాయ్ వరల్డ్ ట్రేడ్ సెంటర్లో జరిగే డబ్ల్యూటిఐటిసి 2025 సదస్సులో రాహుల్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాహుల్ రెడ్డి మాట్లాడుతూ ఇది తనకు లభించిన గొప్ప గౌరవమని, ప్రపంచ తెలుగు విద్యార్థులను అనుసంధానించి వారికి కొత్త అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఆవిష్కరణలతో కూడిన బలమైన విద్యార్థి ఎకోసిస్టంను నిర్మించడం తమ ముఖ్య ధ్యేయమని అన్నారు.

రాహుల్‌రెడ్డిని అభినందిస్తున్న దృశ్యం

అంబేద్కర్ వర్ధంతిని పుస్కరించుకుని 40వ స్మారకోపన్యాసం

సైఫాబాద్, డిసెంబరు 3 ప్రభాతవార్త: పపంచ మేధావి, రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 6వ తేదీ సాయంత్రం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో అంబేద్కర్-40వ స్మారకోపన్యాసం నిర్వహిస్తున్నామని అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి గనుమల జ్ఞానేశ్వర్ తెలిపారు. 'అధిక సంఖ్యాకుల ఆధిపత్యం-అల్ప సంఖ్యాకుల హక్కులు: అంబేద్కర్ దృక్పథం' అనే అంశంపై ప్రముఖ పత్రికా సంపాదకులు డా.కె.రామచంద్రమూర్తి ప్రసంగిస్తారని, ఇంతవరకు జరిగిన స్మారకోపన్యాసాల సంకలనం (1986-2023) 'అద్వితీయుడు' అనే పుస్తకం ఆవిష్కరణ కూడా జరుగుతుందని, ట్రస్ట్ ఛైర్మన్ డా.కె.లింగయ్య అధ్యక్షత వహిస్తారని బుధవారం బషీర్ బాగ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో దళితులు, అంబేద్కర అభిమానులు, అంబేద్కరిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. గత 4 దశాబ్దాలుగా ప్రతిష్టాత్మకమైన అంబేద్కర్ స్మారకోపన్యాసాలను ఈ ట్రస్ట్ నిర్వహిస్తున్న సంగతి అందరికి తెలిసిందే.

గిరికాపల్లిలో అయ్యప్ప మహాపడి పూజ



అయ్యప్పస్వామి మహాపడి పాల్గొన్న అయ్యప్పస్వాములు

అప్జల్‌గంజ్,డిసెంబర్ 3ప్రభాతవార్త:

గిరికాపల్లిలో అయ్యప్పస్వామి మహాపడి పూజ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.ఈశ్వర్ కన్నస్వామి,విక్కి ఆధ్వర్యంలో నిర్వహించిన మహాపడి పూజను సంతోషచార్యులు అయ్యప్పస్వామికి అభిషేకాపూజలను చేశారు.మణికంఠ ఆశ్రమం ఓంసాయి భజన మండలి గాయకులు పి.శ్యామ్‌కుమార్ అయ్యప్పస్వామి భక్తీ గీతాలను ఆలపించారు. అయ్యప్ప స్వాములుభక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హిందు దేవుళ్లపై సిఎం అనుచిత వాఖ్యలను ఖండిస్తూ బిజెపి నిరసన



తార్నాక చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న బిజేపీ శ్రేణులు

తార్నాక, డిసెంబర్ 3 ప్రభాతవార్త : హిందూ దేవుళ్లపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ తార్నాక చౌరస్తాలో బుధవారం బిజెపి నాయకుల ఆందోళన రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు సీఎం దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు యత్నంచగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు బిజెపి నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక చంద్రారెడ్డి మాట్లాడుతూ హిందువుల మనోభావాలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ గౌడ్,శారద మల్లేష్, ఉపెందర్ యాదవ్, వీరన్న, శ్రీనివాస్ చారి,కొన్నె సంపత్, బండ శివారెడ్డి, అనిత, సుక్క గనేష్ ముదిరాజ్, కరుణాకర్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ప్యారడైజ్ వద్ద నిరసన తెలుపుతున్న బిజెపి నేతలు

వైభవంగా ముగిసిన భగవద్గీత మహాయజ్ఞం

- గీతను మించిన వ్యక్తిత్వ వికాస పుస్తకం మరోటి లేదు : లక్ష్మణ్
- గీతా పారాయణంతో సద్గుణాలన్నీ ఒంటబడుతాయి : ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, డిసెంబర్ 2 ప్రభాతవార్త : భగవద్గీతను మించిన వ్యక్తిత్వ వికాసం పుస్తకం ప్రపంచంలో మరోటి లేదని బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్ పేర్కొన్నారు. బుధవారం నార్సింగి మున్సిపల్ జన్వాడ గ్రామంలో ఉన్న ఎస్ఎంపి యూనివర్శల్ స్కూల్‌లో జరిగిన "శ్రీమద్భగవద్గీత మహాయజ్ఞం" ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగద్గురువు శ్రీకృష్ణ పరమాత్ముడి ముఖారవిందం నుంచి ఉద్భవించిన గీతను ప్రతీ ఒక్కరూ నిత్య పారాయణం చేయాలన్నారు. ఏ ఇంట్లో గీతాపారాయణం క్రమం తప్పకుండా జరుగుతుందో ఆ ఇంట్లోని సభ్యులంతా వ్యసనాలు, దుర్గుణాలకు దూరం అవుతారని, ఆత్మ హత్య అనే పదం వారి జీవితంలో నుంచి వెళ్లిపోతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ గీతా పారాయణం వంటి అద్భుతమైన కార్యక్రమాన్ని నిర్వహించిన ఎస్ఎంపి యూనివర్శల్ పాఠశాల యాజమాన్యంను అభినందిస్తున్నానని తెలిపారు. ఉత్తమ భావి పౌరులుగా ఎదిగేందుకు గీతా పారాయణం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. అనంతరం గణపతి గురుస్వామి మాట్లాడుతూ భక్తి,శ్రద్ధలతో భగవద్గీతను ఎవరు పారాయణం చేస్తారో వారి తలరాత మారుతుందన్నారు. అనంతరం ఎస్ఎంపి యూనివర్శల్ స్కూల్ చైర్మన్ పట్లోళ్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్తమ జాతి నిర్మాణానికి భగవద్గీత ఆరాధన, ఆచరణ అత్యవసరమన్నారు. సర్వోపనిషత్తుల సారమంతా గీతలోనే ఉందన్నారు. గీతా జయంతి మొదలుకొని వరుసగా మూడు రోజుల పాటు భగవద్గీతా మహాయజ్ఞనంను నిర్వహించామని వివరించారు. శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య శ్రీమద్ అభినవోద్దండ నృసింహ భారతీ మహాస్వామి అనుగ్రహంతో ఈ కార్యంను జరిపించామన్నారు. 18.మంది తిరుమల తిరుపతి దేవస్థానం పండితుల మంత్రోచ్చరణలతో పాఠశాల ప్రాంగణమంతా మారుమ్రోగింది. శ్రీవేంకటేశ్వర కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, పాఠశాల కరస్పాండెంట్ చంద్రకళ, విద్యార్థులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

జన్వాడ ఎస్ఎంపి యూనివర్శల్ స్కూల్‌లో జరిగిన శ్రీమద్భగవద్గీతా మహాయజ్ఞంలో పాల్గొన్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

శిక్షణలో తెలుసుకున్న అంశాలను విధి నిర్వహణలో పాటించాలి : ఎసిపి శంకరరాజు

బేగంపేట డిశంబరు 3,ప్రభాతవార్త

నగరంలో మారుతున్న అత్యాధునిక మార్పులకు అనుగుణంగా హైదరాబాద్ నగర పోలీసు కమీషనర్ వి.సి.సజ్జనార్ మార్గదర్శకత్వంలో నార్త్‌జోన్ ట్రాఫిక్ పోలీసులకు బేగంపేట లోని ట్రాఫిక్ ట్రయినింగ్ ఇనిసిట్యూట్ లో నవంబరు 24న ప్రారంభమైన ఒక గొప్ప మార్పుకు ఇదే శ్రీకారం శిక్షణా తరగతులు బుధవారంతో ముగిసాయి.నగర పోలీసు కమీషనర్ వి.సి.సజ్జనార్ ప్రారంభించిన ఒక గొప్ప మార్పుకు ఇదే శ్రీకారం అనే అంశంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా నార్త్‌జోన్ కు చెందిన 452మంది సిబ్బందికి విడతల వారీగా 9రోజుల పాటు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించినట్లు ట్రాఫిక్ ఏసీపీ శంకరరాజు తెలియజేసారు.ఈ శిక్షణలో నార్త్‌జోన్ కు చెందిన ఇన్స్‌పెక్టర్లు,సబ్‌ఇన్స్‌పెక్టర్లు,ఏఎస్సైలు,హెడ్ కానిస్టేబుల్స్ ,కానిస్టేబుల్స్, మహిళా కానిస్టేబుల్స్,హోంగార్డులు శిక్షణా కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు.ప్రజలతో సన్నిహిత సంబంధాలు కొనసాగించడం,సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం, విధుల్లో ఉన్నప్పటికీ వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం,హైదరాబాద్ నగర ప్రాముఖ్యతను చాటి చెప్పడం,ఆర్థిక క్రమశిక్షణ అనే విభిన్నమైన అంశాలపై శిక్షణ పూర్తి చేసామని ,శిక్షణా కాలంలో ప్రతిభను చూపిన సిబ్బందికి బహుమతులను ప్రధానం చేసామని ఏసీపీ తెలియజేసారు.

శిక్షణ ముగించుకున్న సిబ్బందితో ఎసిపి శంకరరాజు.

20,21 తేదీల్లో అంతర్జాతీయ ఓపెన్‌రాపిడ్ చెస్ టోర్నమెంట్

ఏకాగ్రా చెస్ అకాడమీ వైస్ చైర్మన్ షరీఫ్ మహ్మద్

టోర్ని పోస్టర్ ఆవిష్కరిస్తున్న షరీఫ్ మహ్మద్, గిరీష్‌రెడ్డి, సౌమ్యా జాను తదితరులు

హైదరాబాద్, డిసెంబరు 3,ప్రభాతవార్త:

ఏకాగ్రా చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో అంతర్జాతీయ ఓపెన్ రాపిడ్ చెస్ టోర్న

పార్లమెంట్‌లో తక్షణమే బిసి బిల్లు ప్రవేశపెట్టాలి

బిసి పొలిటికల్ ఫ్రంట్ ఛైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్

శ్రీకాంతాచారి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న బీసీ పొలిటికల్ ఫ్రంట్ నాయకులు

ముషీరాబాద్, డిసెంబర్ 3, ప్రభాతవార్త: పార్లమెంట్‌లో తక్షణమే బీసీ బిల్లు ప్రవేశపెట్టి, బీసీలపై చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బీసీ పొలిటికల్ ఫ్రంట్ ఛైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు కాసోజు శ్రీకాంతాచారి 16వ వర్ధంతి సందర్భంగా చిక్కడపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వైస్ ఛైర్మన్ ఎస్.దుర్గయ్యగౌడ్, కన్వీనర్లు బైరు శేకర్, అంబాల నారాయణగౌడ్, ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, బోయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోయ గోపి, మధుసూదనాచారి, నాగభూషణం, దామోదర్, గడ్డమీద విజయ్, ప్రమీల, హర్షవర్ధన్, సచిన్ తదితరులు పాల్గొని శ్రీకాంతాచారి చిత్ర పటానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి గడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికార దాహంతో బీసీలను నయవంచన చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంకు వారోత్సవాలు జరిపే నైతికత లేదని ధ్వజమెత్తారు. జనరల్ స్థానాలలో అగ్రకులాలను ఓడించి, బీసీలు కైవసం చేసు కోవాలని పిలుపునిచ్చారు. 46వ జీవో తెచ్చి, స్థానిక సంస్థలకు బీసీలను దూరం చేసిన కాంగ్రెస్, పార్లమెంట్‌లో బిల్లుపెట్టకుండా, 9వ షెడ్యూల్‌లో చేర్చకుండా వివక్ష చూపిస్తున్న బీజేపీ, ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్‌లను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్ బోర్డు సిఈఓతో బేటీ అయినా ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్,డిసెంబర్ 3 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన బస్తీ పర్యటనలో తన దృష్టికి వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ బోర్డుసి ఈఓ అరవింద్ కుమార్ ద్వివేదికి సూచించారు. బుధవారం ఆయన బోర్డు సిఈఓతో సమావేశమై ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న కంటోన్మెంట్ వాణి కార్యక్రమంలో సిఈఓతో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొని ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

కోర్టు నిర్ణయంతో సామాజిక సేవలో నిందితులు

కృష్ణకాంత్ పార్కులో నాంపల్లి కోర్టు ఆదేశాల మేరకు సామాజిక సేవా కార్యక్రమం నిర్వహిస్తున్న వివిధ కేసుల్లోని నిందితులు.

యూసుఫ్‌గూడ, డిసెంబర్ 3 ప్రభాతవార్త : వివిధ కేసుల్లో నమోదైన నిందితులతో సామాజిక సేవలో పాల్గొనే విధంగా నాంపల్లి కోర్టు వినూత్న నిర్ణయం తీసుకుంది. వెస్ట్ జోన్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైన కేసులతో బుధవారం నాంపల్లి కోర్టు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలతో మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణకాంత్ పార్కులో నిందితులతో సామాజిక సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 42 మంది నిందితులు పాల్గొన్నారు. మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల నుంచి 25 మంది నిందితులు, బోరబండ పోలీస్ స్టేషన్‌లో కేసుల నుంచి 12 మంది నిందితులు అదేవిధంగా పంజాగుట్ట స్టేషన్‌లో నమోదైన కేసుల నుంచి ఐదుగురు నిందితులతో పార్కులోని వ్యర్థలాని శుద్ధి చేసి సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. న్యాయస్థానం ఆదేశించిన విధంగా పార్కులో సామాజిక సేవా కార్యక్రమాలను వారితో పూర్తి చేశామని మధురానగర్ ఇన్స్‌పెక్టర్ ప్రభాకర్ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

రాజీవ్‌గాంధీనగర్ ఏబ్లాక్‌లో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్.

యూసుఫ్‌గూడ, డిసెంబర్ 3 ప్రభాతవార్త : ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు పాదయాత్ర నిర్వహించి సమస్యలను పరిష్కరించటం జరుగుతుందని అల్లాపూర్ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని సబ్దార్‌నగర్‌లో ప్రజా సమస్యలపై పాదయాత్ర నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా భూగర్భ డ్రైనేజీతో పాటు నూతన సీసీ రోడ్ల ఏర్పాటు, వీధి దీపాల ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. అందుకు ఆమె వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు త్వరగా పూర్తయ్యేల కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాల దుర్గా, ఏ.బ్లాక్ అధ్యక్షులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ దేవుళ్లను కించపర్చిన సిఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి : బానుక నర్మద

జెబిఎస్ వద్ద సిఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న బిజెపి నేతలు

కంటోన్మెంట్,డిసెంబర్ 3 ప్రభాతవార్త: హిందూ దేవుళ్లపై అనుచి వాఖ్యలు చేసిన సిఎం రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మద,మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపికలు డిమాండ్ చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి హిందూ దేవుళ్లపైన అనుచిత వాఖ్యలు చేసినందుకు నిరసనగా బుధవారం సికింద్రాబాద్ జెబిఎస్ వద్ద సిఎం రేవంత్ రెడ్డికి, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు విజయానంద్, టో పీ శంకర్, మాచెర్ల శ్రీనివాస్, విజయ రామరాజు, భాగ్యమ్మ, సతీష్ ఆయా వార్డులకు చెందిన బిజెపి అధ్యక్ష,కార్యదర్శులు పాల్గొన్నారు.

సిఎం విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సరికాదు

-వెంటనే హిందూ సమాజానికి క్షమాపణాలు చెప్పాలి : బిజెపి

అత్తాపూర్ డిసెంబరు3,ప్రభాతవార్త : సిఎం స్థాయిలో ఉండి హిందూ భావాలను దెబ్బతీసే, సమాజంలో విద్వేషాన్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని పలువురు బిజెపి నేతలు మండిపడ్డారు.సిఎం రేవంత్ రెడ్డి హిందూదేవుళ్లపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పొన్నమోని మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఆరంఘర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సిఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడానికి బీజేపీ నాయకులు ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు.దింతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది.ఈ సందర్భంగా పలువురు బీజేపీ నేతలు మాట్లాడుతూ... హిందూ సమాజాన్ని అవమానించిన వ్యాఖ్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే వెనక్కి తీసుకోని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హిందూ ధర్మాన్ని అవమానించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, అవసరమైతే తీవ్ర ఉద్యమాలు చేపట్టడానికి బీజేపీ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. హిందూ సమాజ గౌరవం, హిందూ దేవతలను, ధర్మరక్షణ, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి గోల్కొండ జిల్లా ఇన్‌ఛార్జ్ వై. శ్రీధర్, చేవెళ్ల బిజెపి లోక్‌సభ కన్వీనర్ నారాగూడెం మల్లారెడ్డి, రాజేంద్రనగర్ బిజెపి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి, కొమురయ్య, జోగు రవి, కడెం సుధాకర్ (రాష్ట్ర కౌన్సిల్ మెంబర్), కోరాని సదానంద్, సోల్కర్ రెడ్డి, రాచూరి రాజశేఖర్, సరితా రెడ్డి , డివిజన్‌ల అధ్యక్షులు సూరెడ్డి వినయ్ రెడ్డి, పసుపుల సందీప్, సులిగే వెంకటేష్, మహిళా మోర్చా నాయకురాలు వనిత రెడ్డి ,బిజెపి నేతలు గోదా పాండు యాదవ్, ఎస్. రాహుల్ రెడ్డి, రాజా శేఖర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, పవన్, బాబురావు యాదవ్, పాతలావత్ రామారావు, ఈ. వేణు గోపాల్, ఆది మూల చంద్రశేఖర్, మన్మోహన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శరత్‌కు నివాళులర్పించిన మాజీ కేంద్ర మంత్రి సర్వే

ఎమ్మార్పీఎస్ నేత దుడ్డు శరత్‌కు నివాళులర్పిస్తున్న కేంద్ర మాజీ మంత్రి, సర్వే సత్య నారాయణ,చిత్రంలో దేవుడు, ముప్పిడి గోపాల్‌నతదితరులు

కంటోన్మెంట్,డిసెంబర్ 3 ప్రభాతవార్త: కంటోన్మెంట్ పికెట్ లక్ష్మి నగర్‌లో నివాసం ఉంటున్న బోయిన్‌పల్లి మార్కెట్ వైస్ ఛైర్మన్ డి.బి.దేవేందర్ (దేవుడు) కుమారుడు ఎమ్మార్పీఎస్ నేత శరత్ గత నెల 23వ తేదీ గుండె పోటుతో మృతి చెందాడు. బుధవారం నిర్వహించిన సంతాప సభలో కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్య నారాయణ, బోయిన్‌పల్లి మార్కెట్ తొలి ఛైర్మన్ ముప్పిడి గోపాల్, వెజిటేబుల్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమ దేవేందర్‌రెడ్డి, దళిత చైతన్య గాయకుడు ఎన్.వై. అశోక్, ఎమ్మార్పీఎస్ వ్యవస్తాపక అధ్యక్షులు మంద క్రిష్ణ మాదిగ కుమారుడు మంద కార్తీక్, కంటోన్మెంట్ ఇన్‌ఛార్జి ఇటుక శ్రీకిషన్ మాదిగలు, ఇటుక గోపి, ఏ.ఎల్. ఆనంద్, రొట్టెల సునీల్, దుడ్డు సత్య నారాయణ, పికెట్ లక్ష్మి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అశోక్, కాంగ్రెస్ నేత బొల్లు కిషన్‌లు పాల్గొని ఆయన చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు.

కనీస వసతులు లేని ప్రభుత్వ ప్రాథమిక ఉపకేంద్రం : జనసేన నేత ప్రేమ కుమార్

ప్రభుత్వ ప్రాథమిక ఉపకేంద్రాన్ని పరిశీలించిన ప్రేమ కుమార్

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 3, ప్రభాతవార్త : కెపిహెచ్‌బి కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక ఉపకేంద్రంలో కనీస వసతులు కరువయ్యాయని కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ఆరోపించారు. బుధవారం కెపిహెచ్‌బి కాలనీ 3వ ఫేస్‌లోని ప్రభుత్వ హాస్పిటల్ ప్రాథమిక ఉప కేంద్రాన్ని ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ జనసైనికులతో కలిసి సందర్శించి హెల్త్ అసిస్టెంట్, సిబ్బంది పిల్లల టీకాలు వేయించుటకు వచ్చిన తల్లితండ్రులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ కెపిహెచ్‌బి కాలనీలో చంటి పిల్లలకు టీకాలు వేసే హాస్పిటల్ పరిసరాలు చెత్త, దోమలుతో కూడి అపరిశుభ్రంగా ఉందని, తల్లితండ్రులు కూర్చోవటాని కుర్చీలు, షెడ్ లేవని, తల్లితండ్రులకు కనీససం మరుగుదొడ్ల సౌకర్యాలు కూడ లేకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్పిటల్ ఉన్నచోట బోర్డ్ కూడా పెట్టని దౌర్భాగ్య స్థితిలో ప్రభుత్వం ఉందని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుని కనీస వసతులు ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కోల్లా శంకర్, కలిగినీడి ప్రసాద్, సలాది శంకర్, దాసరి వెంకట్, సుంకర సాయి, బావిశెట్టి గోపి, బండారి రమేష్, పులగం సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

పంచగిరిష భక్త సమాజం ఆధ్వర్యంలో 30 వార్షికోత్సవ వేడుకలు

వేడుకల్లో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 3, ప్రభాతవార్త : పంచగిరిషా భక్త సమాజం 30 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా భక్త సమాజం ఆధ్వర్యంలో 30వ వార్షికోత్సవ మహోత్సవం భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీలో నిర్వహించారు. ఈ మహోత్సవం చంద్రశేఖర్ గురుస్వామి, రామకృష్ణ గురుస్వామిల పర్యవేక్షణలో భజన సామ్రాట్ పి.వి. సుబ్బారావు అత్యంత భక్తిరసభరిత భజనలతో మహా పడిపూజ ఘనంగా జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు గురుస్వామి భక్తిశ్రద్ధతో పాల్గొని స్వామివారి దివ్యదర్శనం పొందారు. అనంతరం రాజేశ్వరరావు మాట్లాడుతూ పంచగిరిషా భక్త సమాజం గత మూడు దశాబ్దాలుగా భక్తి, సేవ, సమాజ శ్రేయస్సు కోసం నిరంతరంగా సేవలందిస్తోందనీ భక్తుల ఏకత్వమే ఈ సమాజానికి నిజమైన బలం అని పేర్కొన్నారు.

కూలిపోయిన గోడ త్వరలో నిర్మాణం

ముషీరాబాద్, ఎమ్మెల్యే ముఠా గోపాల్

స్మశాన వాటిక గోడ పునర్నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, డిసెంబర్ 3, ప్రభాతవార్త: ముషీరాబాద్ నియోజకవర్గంలోని గంగపుత్ర సంఘం స్మశాన వాటికలో కూలి పోయిన గోడ నిర్మాణం త్వరలోనే పూర్తి అవుతుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. బుధవారం సంబంధిత అధికారులతో కలసి ఆయన గోడ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూలిపోయిన గోడ నిర్మాణ పనులను వేగవంతం పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. అనంతరం ముషీరాబాద్ డివిజన్‌లోని పవర్‌చర్చ్ వీధిలో నాలా స్లాబ్ పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారి గీత, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ముఠా జైసింహ, ముషీరాబాద్ గంగపుత్ర సంఘం అధ్యక్షులు జగన్, సంఘం నాయకులు పూస శ్రీరాములు, గాండ్ల ప్రభాకర్, మీసాల ప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు పూస గోరఖ్‌నాథ్, దీన్‌దయాళ్‌రెడ్డి, టెంట్‌హౌస్ శ్రీను, రమాస్వామి, బిట్టు, రాము, నరేష్ పాల్గొన్నారు.

నియోజకవర్గం సమాగ్రాభివృద్ధికి కట్టుబడి పని చేస్తాం : ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి

యుజిడి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అల్వాల్, డిసెంబరు 3 ప్రభాతవార్త: మల్కాజిగిరి నియోజకవర్గం సమాగ్రాభివృద్ధికి కట్టుబడి పని చేస్తున్నామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని సాయినగర్, హనుమాన్ టేక్డీ ప్రాంతాలులో 33లక్షలు వ్యయంతో చేపట్టనున్న యుజిడి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్నా నిధులు సమీకరణ కోసం అహర్నిశలు శ్రమిస్తున్నామని మర్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డిజిఎం శాంభయ్య, బిఆర్ఎస్ సీనియర్ నేతలు దోలి రమేష్, శోభన్, లక్ష్మణ్ యాదవ్, ప్రశాంత్ రెడ్డి, సురేష్,శరణగిరి పాల్గొన్నారు.

ఆర్‌యుబి పనులను పరిశీలించిన కార్పొరేటర్

అధికారులుతో కార్పొరేటర్

అల్వాల్, డిసెంబరు 3 ప్రభాతవార్త: తుర్కపల్లి రైల్వే గేట్ వద్ద కొనసాగుతున్న ఆర్‌యుబి పనులను మచ్చబొల్లారం కార్పొరేటర్ జితేందర్‌నాథ్ బుధవారం అధికార యంత్రాంగంతో కలిసి పరిశీలించారు. ఆర్‌యుబి నుంచి విబి సిటి మీదుగా కొంపల్లి బొల్లారం రోడ్డు అప్రె సంజీవ్ రెడ్డి గార్డెన్ వరకు ఆర్‌సిసి డ్రైనేజీ లైను ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు. అండర్ పాస్ బ్రిడ్జి కారణంగా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారే అవకాశాలు ఉన్నాయని స్థానికులు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లికి విన్నవించారు. ఈ నేపథ్యంలో కార్పొరేటర్ రైల్వే, జలమండలి, ఇంజనీరింగ్ అధికారులుతో కలిసి ఆర్‌యుబి పనులను పరిశీలించడం జరిగింది.

మహిళ మృతి

పేట్ బషీరాబాద్, డిసెంబర్ 3, ప్రభాతవార్త

ఓ మహిళ మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పలికి లక్ష్మి (50) సుమారు 20 సంవత్సరాల క్రితం ఆంధ్ర ప్రాంతం నుండి గుండ్ల పోచంపల్లికి బ్రతుకుతెరువు నిమిత్తం వచ్చి గుండ్ల పోచంపల్లిలోని స్మశాన వాటిక పక్కన గల రేకుల షెడ్డులో ఒక్కతే ఉంటుంది. ఈమెకు బంధువులు, సంబంధించిన వారు ఎవరూ లేరు. ఈమె గుండ్లపోచంపల్లిలో రోడ్డుపై అడుక్కుంటూ గడిపేది. బుధవారం ఉదయం 6 గంటల సమయంలో చుట్టుపక్కల వారు చూడగా ఆమె పడుకున్న చోటనే మరణించింది. మృతురాలు బహుశా అనారోగ్యంతో లేదా మరే ఇతర కారణాల వల్ల చనిపోయి ఉండవచ్చని పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సిఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం

చౌరస్తాలో సిఎం రేవంతెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బిజెపి నాయకుల దృశ్యం.

నార్సింగి, డిసెంబర్ 3 ప్రభాతవార్త : గండిపేట మండలం నార్సింగి చౌరస్తాలో బుధవారం బిజెపి నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కోట్లాది మంది హిందువుల మనోభావాలు దెబ్బతినేలా దేవీ, దేవతలను సీఎం కించపరిచటాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమంను చేపట్టామని అధ్యక్షులు మెండె నాగేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాగేష్ మాట్లాడుతూ హిందువులు శాంతియుతంగా ఉన్నంత వరకే ఇలాంటి వారి ఆటలు సాగుతాయని, ఒక్కసారి పిడికిలి ఎత్తితే వీరంతా భస్మం అవుతారని పేర్కొన్నారు. హిందువులను, హిందువుల ఆరాధ్య దైవాలను దూషించే నాయకులకు గుణపాఠం చెప్పాలంటే పంచాయతీ ఎన్నికల్లో ప్రజలంతా కాంగ్రెస్‌కు ఓట్లు వేయకూడదని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు లక్ష్మీనారాయణ, బిక్షపతి యాదవ్, శివరాజ్, జైపాల్‌రెడ్డి, బ్రహ్మచారి, అనిల్, సురేందర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్,సీటు బెల్టు లేని ప్రయాణంతో ప్రాణాలు కోల్పోకండి

-రసూల్‌పురా జంక్షన్‌లో వాహనదారులకు అవగాహన

రసూల్‌పురా చౌరస్తాలో హెల్మెట్,సీటుబెల్టుపై సర్వేజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్న యమధర్మరాజు పాత్రధారుడు.

బేగంపేట డిశంబరు 3,ప్రభాతవార్త

హెల్మెట్,సీటు బెల్టులేని ప్రయాణంతో ప్రాణాలు కోల్పోకండి అంటూ సర్వేజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రసూల్‌పురా జంక్షన్‌లో బుధవారం వాహనదారులకు అవగాహన కల్పించారు.ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని 365జంక్షన్లలో సంవత్సరం పాటు రహదారి బద్రతపై అవగాహన కల్పించనున్నట్లు సర్వేజనా ఫౌండేషన్ ఛైర్మన్ డా.ఏ.వి.గురవారెడ్డి తెలియజేసారు.హెల్మెట్ ధరించని వాహనదారుల మెడలో యమధర్మరాజు పాత్రధారి మెడలో యమపాశం వేసి హెల్మెట్ ధరించకుంటే ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతారంటూ వారిని హెచ్చరించారు.అలాగే కార్లలో ప్రయాణిస్తున్న వాహనదారులు సీటు బెల్టు తప్పకుండా ధరించాలని హెచ్చరించారు.అకాల మరణాలతో యమలోకంలో సరైన సదుపాయాలు కల్పించలేకపోతున్నామంటూ యమధర్మరాజు పాత్రధారి వారికి సూచించారు.హైదరాబాద్ నగరాన్ని సేఫరాబాద్ గా మార్చాలనే లక్ష్యంతో సర్వేజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఫౌండేషన్ ఛైర్మన్ డా.ఏ.వి.గురవారెడ్డి తెలియజేసారు.నగరంలోని 365 జంక్షన్లను ఎంచుకొని ఏడాది పాటు ఇలా వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.దీని ద్వారా అకాల మరణాలను తగ్గించి హైదరాబాద్ ను సేఫరాబాద్ గా మార్చాలనే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ డ్రైవింగ్ చేస్తే 60శాతం మరణాలను అడ్డుకోవచ్చని తెలియజేసారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సర్వేజనా ఫౌండేషన్ సీఈఓ రిటైర్డ్ ఐఏఎస్ డా.బి.జనార్ధన్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సర్వేజనా ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాలను తెలియజేసారు.రసూల్‌పురా జంక్షన్ లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ కమీషనర్ రవికిరణ్,నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ జి.శంకరరాజు,సర్వేజనా ఫౌండేషన్ సభ్యులు వంశీ మోదుగుల,రాం మంజీరి తదితరులు పాల్గొన్నారు.యమధర్మరాజు వేషధారణలో అర్జునరావు యమపాశంతో వాహనదారులకు అవగాహన కల్పించారు.

అన్ని వర్గాల అభివృద్ధే ఎఐపిసి లక్ష్యం : అధ్యక్షులు అదిత్యారెడ్డి

మెంబర్‌షిప్‌డ్రైవ్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆదిత్యారెడ్డి,భరత్‌రెడ్డి, సంతోష్ తదితరులు

హైదరాబాద్, డిసెంబరు 3,ప్రభాతవార్త: రైతులు, యువత అభివృద్ధికి మహిళాసాధికారతకు ఆల్ ఇండియా ప్రొఫెసనల్స్ కాంగ్రెస్ (ఎఐపిసి) పనిచేస్తున్నదని ఎఐపిసి రాష్ట్ర అధ్యక్షులు ఆదిత్య రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఆలిండియా ప్రొఫెసనల్స్ కాంగ్రెస్ మెంబర్‌షిప్ డ్రైవ్‌కు సంబంధించిన బ్రోచర్ ను వివిధ సంస్థల నిపుణులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదిత్య రెడ్డి మాట్లాడు తూ వ్యాపారావకాశాలపై ఆసక్తి ఉన్నవారికి తాము మంచి ప్లాట్ ఫామ్ అందిస్తామన్నారు. అగ్రికల్చర్, ఐటి, స్పోర్ట్స్, పరిశోధన, హెల్త్ , ఆర్కిటెక్ట్, ఫొటోగ్రఫీ, చార్టర్డ్ ఆకౌంట్ వంటి రంగాలపై అవగాహన కల్పించి వారి అభివృద్ధికి సహకరిస్తామన్నారు. ప్రజల అభివృద్ధికి చేసే ప్రభుత్వ కార్యక్రమాలపై భాగస్వామ్యవు తామన్నారు. ఆసక్తి ఉన్న యువత ఆలిండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ లో ప్రవేశం పొందేందుకులో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో వివిధరంగాల నిపుణులు భరత్‌రెడ్డి, సంతోష్, సందీష్, సిఎం సుబ్బారావు, కవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హత్యకేసును ఛేదించిన ఓ.యూ పోలీసులు

వివరాలను వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి ఇతర అధికారులు

తార్నాక, డిసెంబర్ 3 ప్రభాతవార్త : తార్నాక ఎర్రకుంట చెరువు వద్ద కలకలం రేపిన గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసును ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు ఛేధించారు. హత్య చేసిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఈ మేరకు బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈస్ట్ జోన్ డిసిపి డాక్టర్ బాలస్వామి, అడిషనల్ డీసీపీ నరసయ్య, ఓయూ ఏసిపి జగన్, సిఐ అప్పల నాయుడు, డిఐ రవికుమార్ తో కలసి వివరాలను వెల్లడించారు. సికింద్రాబాద్ చిలకలగూడ లో నివాసముండే షేక్ గౌస్ (43) రాంనగర్ ఫిష్ మార్కెట్లో చేపల వ్యాపారం చేస్తుంటాడు. అదే చిలకలగూడ ప్రాంతానికి చెందిన సయ్యద్ షోయబ్(32) కారు డ్రైవర్ గా పని చేస్తున్నాడు. వీరు ఇద్దరు కలిసి నగరంలోని వివిధ ప్రాంతాలలో చేపలు సరఫరా చేస్తుంటారు. అయితే తమ వ్యాపారంలో తీవ్ర నష్టాలు రావడంతో పాటు కుటుంబ సమస్యలు అధికమయ్యాయి. ఇదే క్రమంలో వీరికి

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

నేరెడ్ మెట్, డిసెంబర్ 3,ప్రభాతవార్త :

సమాచార సాంకేతికత విస్తరిస్తున్న కొద్దీ దొంగతనం, మోసాలు కూడా కొత్త పుంతలు తొక్కుతున్నాయని, ప్రతి ఒక్కరూ జాగ్రత్త గా ఉండాలని నేరెడ్మెట్ ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం సైనిక్ పురి భవన్స్ కళాశాలలో నేరెడ్ మెట్ పోలీసు విభాగం నిర్వహించిన మోసాలకు పూర్తి విరామం" ఆరు వారాల ప్రచార కార్యక్రమంలో భాగంగా సైబర్ సరధి" అంశంపై విద్యార్థులలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్ మాట్లాడుతూ మొబైల్ సందేశాలు, తెలియని లింకులు, తప్పుడు కాల్లు, సామాజిక మాధ్యమాల ద్వారా డబ్బు దోచుకునే ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు. ఎవరైనా మోసానికి గురైతే వెంటనే ఒక తొమ్మిది మూడు సున్నా సేవ ద్వారా తెలియజేయాలని, జరిగిన వెంటనే సమాచారం ఇస్తే నష్టాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని వివరించారు. వ్యక్తిగత వివరాలు, రహస్య సంకేతాలు ఎవరికీ చెప్పకూడదని, తెలియని లింకులపై నొక్కకూడదని, డిజిటల్ చెల్లింపులు చేసేప్పుడు రెండు సార్లు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో సైబర్ నేరాల నిరోధానికి ప్రమాణ స్వీకారం నిర్వహించారు. విద్యాసంస్థల్లో సైబర్ నేరల పై అవగాహన సదస్సు లాంటి కార్యక్రమాలు ఇంకా ముమ్మరం గా కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

-కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి తదితరులు

మల్క్ పేట, డిసెంబర్ 3, ప్రభాతవార్త: అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని ముసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. డివిజన్ లోని సలీమ్ నగర్ కాలనీలో రూ.13 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులను కాలనీ వాసులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాపు నీరు నిలవ ఉండకుండా రోడ్డు నిర్మాణం పనులను త్వరగా పూర్తిచేయాలని, అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. డివిజన్ ప్రజలకు మాలిక సదుపాయాలు కల్పించి ముసలంబాగ్ డివిజన్ అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ఈకార్యక్రమం లోజిహెచ్ఎంసి వర్క్ ఇన్స్పెక్టర్ సత్తిరెడ్డి ,సూపర్వైజర్ సతీష్, నాయకులుకొప్పుల దినేష్,సురేష్ కుమార్,యాదయ్య ,వెంకట్ పాల్గొన్నారు.

అంబేద్కర్‌నగర్‌లో బంగారు మైసమ్మ ఆలయ వార్షికోత్సవం

నేరెడ్ మెట్, డిసెంబర్ 3, ప్రభాతవార్త:

మల్కాజ్గిరి నియోజకవర్గం వినాయక నగర్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ కాలనీలో మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బంగారు మైసమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వినాయక నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ యూసుఫ్ బాయ్, మహిళా అధ్యక్షురాలు ఆశ, పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొని బంగారు మైసమ్మ తల్లి దర్శనం చేసుకుని ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఉత్సవ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బంగారు మైసమ్మ తల్లి అనుగ్రహ ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు యూసుఫ్ బాయ్‌తో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఈ వేడుకల్లో పాల్గొని తల్లి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమం లో స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో హాజరై ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

హిందూ దేవతలపై ముఖ్యమంత్రి వ్యాఖ్యలు సరికావు

ముఖ్యమంత్రి దిష్టి బొమ్మను దహనం చేస్తున్న నాయకులు

హయత్ నగర్, డిసెంబర్ 3 ప్రభాతవార్త :

తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం హిందూ దేవి -దేవతలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ హయత్ నగర్ భారతీయ జనతా పార్టీ యువ మోర్చా అధ్యక్షులు అఖిల్ ఆధ్వర్యంలో హయత్ నగర్ సాయిబాబా గుడి వద్ద రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా అర్బన్ ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్ మాట్లాడుతూ.. హిందూ దేవతలను దూషించడం ముఖ్యమంత్రి కి అలవాటుగా మారిందన్నారు. బాధ్యతా యుతమైన పదవిలో ఉండి హిందువుల మనోభావాలను అవమానపరచే విధంగా మాట్లాడడం దారుణమన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం హిందువుల భావోద్వేగాలను తాకట్టు పెట్టే కాంగ్రెస్ నేతల దుర్మార్గపు విధానాలకు ఇదే నిదర్శనమన్నారు. హిందూ ధర్మాన్ని కించపరచాలనే కుట్రలపై బీజేపీ మోనం పాటించ దని... అలాంటి వారిని ప్రజాస్వామ్య పద్ధతిలో ఎదిరించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ముఖ్యమంత్రి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గంగాని శ్రీనివాస్, పారంద మహేష్, గోవింద చారి, లక్ష్మణ్, శక్తి సింగ్, జంగా రెడ్డి, ఎర్ర ప్రేమ్ పాల్గొన్నారు..

వనస్థలిపురం డివిజన్ బిజెపి అధ్యక్షుడు కాటం క్రాంతి గౌడ్ గారి ఆధ్వర్యంలో రెడ్ వాటర్ ట్యాంక్ చౌరస్తాలో సిఎం దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న బి.జె.పి. నాయకులు.

కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి

-డిసిసి అధ్యక్షుడు ఖలేద్ స్తెఫుల్లా

మలక్ పేట, డిసెంబర్ 3, ప్రభాతవార్త: గ్రేటర్ హైదరాబాద్ లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని హైదరాబాద్ జిల్లా డిసిసి అధ్యక్షుడు ఖలేద్ స్తెఫుల్లా పేర్కొన్నారు. హైదరాబాద్ జిల్లా డిసిసి అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఖలేద్ స్తెఫుల్ల టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ లతో కలిసి సలీంనగర్ లో హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేకోలేకర్ లక్ష్మి, టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చెకలేకర్ శ్రీనివాస్ ల నివాసానికి విచ్చేసి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. అదేవిధంగా డిసిసి అధ్యక్షుడిగా పదవి బాధ్యతలు చేపట్టిన ఖలేద్ స్తెఫుల్లకు వారు పుష్ప గుచ్చాలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా సమావేశాలు నిర్వహిస్తున్నామని, పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని వివరించారు. మలక్ పేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలకు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. డిసిసి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నగర పర్యటనలో భాగంగా మలక్ పేట్ కు రావడం జరిగిందని తెలియజేశారు. జిహెచ్

డిసిసి అధ్యక్షుడు ఖలేద్ స్తెఫుల్లాకు పుష్పగుచ్చాలను అందజేసి శాలువాలతో సన్మానిస్తున్న చైర్మన్ చెకోలేకర్ లక్ష్మి, టిపిసిసి మాజీ కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్, చిత్రంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ తదితరులు

ఎంసి ఎన్నికలలో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీ అభ్యున్నతి కోసం పాటుపడుతున్నామని తెలియజేశారు. ప్రతి బూత్‌లో కాంగ్రెస్ కార్యకర్తలను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇచ్చి నియమిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కిషన్ సింగ్, సాయిరాం, మహమ్మద్ షకీల్, ప్రత్యూష, డివిజన్ అధ్యక్షులు లింగాల శ్రీనివాస్ గౌడ్, చక్రపాణి, రాహుల్ సింగ్, షాహిద్ అలీ ఖాన్, నాయకులు మహేష్, మహమ్మద్ గౌస్, సుమిత్ సింగ్, రోహిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి : కార్పొరేటర్

వనస్థలిపురం. డిసెంబర్.3.ప్రభాతవార్త.

బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సచివాలయ నగర్ సీనియర్ సిటిజన్స్ ఫోరం మరియు సచివాలయ నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సత్కార సభ కార్యక్రమంలో బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి హాజరైయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ ఫోరం సభ్యులు మరియు సంక్షేమ సంఘం సభ్యులు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ ఫోరం భవనముకు నూతన రంగులు వేయించాలని కోరిన వెంటనే నూతన రంగులు కార్పొరేటర్ సొంత నిధుల్లో నుంచి వేయించినందుకు మరియు కాలనీలో నూతన రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినందుకు సీనియర్ సిటిజన్స్ ఫోరం సభ్యులు మరియు సంక్షేమ సంఘం సభ్యులుకార్పొరేటర్ కి ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది అనంతరం కాలనీలో కొంతమేర భూగర్భ డ్రైనేజ్ మరమతు పనులు, మరికొన్ని రోడ్ల నిర్మాణం చేపట్టాలని కార్పొరేటర్‌కి వినతి పత్రం అందజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీల అభివృద్ధికి మరియు సమస్యల పరిష్కారానికి అన్ని విధాలుగా కృషి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ నగర్ సీనియర్ సిటిజన్స్ ఫారం అధ్యక్షులు బసవయ్య, కాలనీ

లచ్చిరెడ్డి ని సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్స్

అసోసియేషన్ అధ్యక్షులు సాంబశివరావు,అసోసియేషన్ సొసైటీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు కూర్మారావు,సీనియర్ సిటిజన్స్ ఫోరం ప్రధాన కార్యదర్శి నరసరాజు, కాలనీ ప్రధాన కార్యదర్శి బాల్ రెడ్డి మరియు కాలనీ సీనియర్ సిటిజన్స్ ఫారం సభ్యులు, సంక్షేమ సంఘం సభ్యులు, సొసైటీ సభ్యులు, మహిళా సోదరీమణులు, మరియు పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు జైపాల్ రెడ్డి, పవన్ రెడ్డి, నాయకులు పిట్ట శ్రీనివాస్ రెడ్డి, ఇప్ప నరసింహారెడ్డి, సుధీర్, మధుసూదన్ రెడ్డి,బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్ మరియు తదితరులు ఉన్నారు.

బోడుప్పల్లో మున్సిపల్ కార్యాలయం ముందు ఫెడరేషన్ ధర్నా

-అక్రమ నిర్మాణాలు ప్రోత్సహిస్తూ, మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్న అధికారులు

-బోడుప్పల్ ఫెడరేషన్ చైర్మన్, డాక్టర్ రాపోలు రాములు అధికారులకు హెచ్చరిక

బోడుప్పల్ , డిసెంబర్ 3, ప్రభాతవార్త :

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రోజురోజు కు పుట్టగొడుగుల్ల అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతోంది. మాజీ ప్రజా ప్రతినిధుల కనుసైగల్లో, అధికారుల అండదండలతో యదేచ్ఛగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని బోడుప్పల్ ఫెడరేషన్ చైర్మన్ డాక్టర్ రాపోలు రాములు ఆధ్వర్యంలో బోడుప్పల్ ఫెడరేషన్ సభ్యులు, వివిధ కాలనీల అసోసియేషన్ సభ్యులు,ప్రజలతో కలిసి మున్సిపల్ కార్యాలయం ముందు ఖిధర్నాఖి నిర్వహించారు. గతంలో అభివృద్ధిలో ఆదర్శంగా ఉన్న బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ నేడు అధికారుల పాలనలో అవినీతిలో కూరుకుపోయిందని, తక్షణమే మున్సిపల్ అధికారులు కార్పొరేషన్ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకొని, మున్సిపల్ ఆదాయాన్ని పెంపొందించి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని, లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని డాక్టర్ రాపోలు రాములు హెచ్చరించారు. చాలా కాలనీలలో మాజీ ప్రజాప్రతినిధుల చొరవతో అక్రమంగా షెడ్లు నిర్మించడం, 2 అంతస్తుల అనుమతితో బహుళ అంతస్తులు నిర్మించడం, పార్కులు, చెరువులు కబ్జా చేయడం జరుగుతుందని అసిస్టెంట్ కమిషనర్ శ్యాంసుందర్ రావుకు వినతిపత్రం అందించారు. గతంలో అభివృద్ధిలో ఆదర్శంగా పలు అవార్డులను అందుకున్న బోడుప్పల్ నేడు అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ గా మారిందని డాక్టర్ రాపోలు రాములు మండిపడ్డారు. ప్రజల అభ్యర్థన మేరకు పలుమార్లు మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేసిన ఎలాంటి ఫలితం లేదని, తక్షణమే మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయాన్ని బోడుప్పల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ముట్టడిస్తామని రాపోలు రాములు మున్సిపల్ కమిషనర్ ఇతర అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ వైస్ చైర్మన్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గడ్డం యాదగిరి, కోశాధికారి బజ్జూరి శ్రీనివాస్ గుప్తా, ఇతర ఫెడరేషన్ సభ్యులు పలు కాలనీలా అధ్యక్ష కార్యదర్శులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దివ్యాంగుల దినోత్సవాన్ని మరచిన కాంగ్రెస్ ప్రభుత్వం

సరూర్‌నగర్, డిసెంబర్ 3 ప్రభాతవార్త: అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 3వ తేదీన జరిపే అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మరిచిపోయిందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నియోజకవర్గంలోని మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డులోనున్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దివ్యాంగులకు ఎలక్ట్రిక్ ఛార్జింగ్‌తో బ్యాటరీ సహాయంతో నడిచే ట్రై సైకిళ్లను సబితా ఇంద్రారెడ్డి అందజేసి మాట్లాడుతూ దివ్యాంగులను సామాజికంగా అన్ని రంగాల్లో ప్రోత్సహించి సాధికారతను సాధించే విధంగా వారిలో ఆత్మ విశ్వాసం నింపాలనే ఉద్దేశ్యంతో అధికారికంగా జరపాల్సిన దివ్యాంగుల దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి, మంత్రులకు సోయి లేకుండా పోయిందనీ కనీసం అధికారులు కూడా దివ్యాంగుల దినోత్సవాన్ని పట్టించుకోకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు దివ్యాంగులకు పెన్షన్లను పెంచి రూ.6 వేలు ఇస్తామని హామీనిచ్చిన కాంగ్రెస్ తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించడం దివ్యాంగులపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతున్నదని ఆమె ఎద్దేవాం చేశారు.

మహేశ్వరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా బ్యాటరీ ట్రై సైకిళ్లు తీసుకొని ఉత్సాహంగా వెళ్తున్న దివ్యాంగులు

దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉండేది కేవలం బిఆర్ఎస్ ప్రభుత్వమేనని సబితారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాలరెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, ఉపాధ్యక్షురాలు పాలపర్తి విజయలక్ష్మి, మీర్‌పేట్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, మహిళాధ్యక్షురాలు జమాల్‌పూర్ సునీత బాలరాజ్, నాయకులు దోమలపల్లి రాజ్‌కుమార్, గడ్డమీది లక్ష్మణ్ ముదిరాజ్, మాదరి రమేష్, అబ్బనమోని గోపియాదవ్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాళ్ళబండి కుమార్ గౌడ్, తుమ్మల నిర్మలారెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి అనుచిత వ్యాఖ్యలపై బిజెపి నిరసన

ఎల్.బి.నగర్, డిసెంబర్ 3 ప్రభాతవార్త:

ముఖ్యమంత్రి తన స్థాయిని మరిచి హిందూ దేవతామూర్తులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, హిందూ సమాజాన్ని కించపరిచే చర్యలపై బీజేపీ ఎప్పటికప్పుడు పోరాటం కొనసాగిస్తామని కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హిందూ దేవతలపై చేసిన అవమానకర వ్యాఖ్యలను ఖండిస్తూ బీజేపీ గడ్డిఅన్నారం డివిజన్ అధ్యక్షుడు దాసరి జయప్రకాశ్ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ప్లాకార్డులతో పెద్ద ఎత్తున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఏనుగు శ్రీధర్‌రెడ్డి, మురళి, చిలకూరి మధుసూదన్‌రెడ్డి, బాబుచౌదరి, రాజు, సిరిరెడ్డి, అమంచి శ్రీనివాస్, సిద్దు, వంశీయాదవ్, టీంకు తదితరులు పాల్గొన్నారు.

ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రేమ్‌మహేశ్వర్ రెడ్డి, జయప్రకాష్

అల్మాస్‌గూడ ఆర్‌విఆర్ కాలనీలో పార్కు స్థలాన్ని కాపాడాలి

కమిషనర్‌కు కాంగ్రెస్ సీనియర్ నేత నవారు మల్లారెడ్డి వినతి

సరూర్‌నగర్, డిసెంబర్ 3 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ రెవెన్యూ పరిధిలో కబ్జా ప్రయత్నాలు జరుగుతున్న ఆర్‌విఆర్ కాలనీలోని విలువైన పబ్లిక్ పార్కు స్థలాన్ని కాపాడాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కాంటెస్టెడ్ కార్పొరేటర్ నవారు మల్లారెడ్డి మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్‌ను కోరారు. బుధవారం మల్లారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, పలువురు కాలనీవాసులు కమీషనర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన కాలనీవాసుల తరపున మాట్లాడుతూ అల్మాస్‌గూడ గ్రామ రెవెన్యూ సర్వే నెంబర్లు 126, 127ల లో అప్పట్లో వెంచర్ చేసిన సమయంలో ప్రస్తుతం ఉన్న ఆర్‌విఆర్ (రామిడి వెంకట్‌రెడ్డి) కాలనీలో దాదాపు 1560 గజాల స్థలాన్ని పార్కు స్థలంగా లేఔట్‌లో చూపించారని కమీషనర్‌కు వివరించారు. అయితే ప్రస్తుతం కొంత మంది సదరు స్థలం తమదేనని పేర్కొంటూ ఆక్రమించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన వెల్లడించారు. ఈ మేరకు సదరు పార్కు స్థలాన్ని కబ్జా కాకుండా రక్షించి దాని చుట్టూ కార్పొరేషన్ తరపున ఫెన్సింగ్ ఏర్పాటు చేయించాలని మల్లారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌విఆర్ కాలనీవాసులు అశోక్‌రెడ్డి, శంకర్‌జీ, శ్రీశైలం, అశోక్, యోగేందర్, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

నవారు మల్లారెడ్డి ఆధ్వర్యంలో కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న అల్మాస్‌గూడ ఆర్‌విఆర్ కాలనీవాసులు

పతకాలు సాధించిన పారా క్రీడాకారులకు సన్మానం

క్రీడాకారులతో ఏసిపి కృష్ణయ్య, ధనంరెడ్డి తదితరులు

హుడా కాంప్లెక్స్, 3 డిసెంబర్, ప్రభాతవార్త:

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 3వ తేదీన సరూర్నగర్ శ్రీ వెంకటేశ్వర కాలనీ రోడ్ నెంబర్ 3 కమ్యూనిటీ హాల్ నందు ద్రోణాచార్య పారా స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి సహకారంతో జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయి పారా పోటీలలో పతకాలు సాధించిన క్రీడాకారులకు ఘన సన్మానం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్బీనగర్ ఏసీపి కృష్ణయ్య పాల్గొని క్రీడాకారులను సత్కరించారు. కమిషనర్ ప్రసంగిస్తు కాలనీ వారి సహాయ సహకారాలతో మరెన్నో సామాజిక కార్యక్రమాలు చెయ్యాలని శ్రీ వెంకటేశ్వర కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారిని అలాగే ద్రోణాచార్య పారా స్పోర్ట్స్ అకాడమీ ఫౌండర్ వేణుతో పాటు పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షుడు మారోజు శ్రీనివాస్ రావు, మునగాల 7నరేష్, సుధాకర 5చారి, కిరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి : కార్పొరేటర్

అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

సైదాబాద్, డిసెంబరు 3 ప్రభాతవార్త: ఐఎస్ సదన్ డివిజన్ పూర్ణోదయ కాలనీలో రూ.37.36 లక్షల వ్యయంతో చేపడుతున్న ఫుట్‌పాత్, వాకింగ్ ట్రాక్ పనులను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతను పాటించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు జంగం మధుకర్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి, అమరేష్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బృందావన్ కాలనీలో.. ఐఎస్ సదన్ డివిజన్ బృందావన్ కాలనీలో రూ.15 లక్షల వ్యయంతో చేపడుతున్న మ్యాన్ హోల్స్ మరమ్మత్తు పనులకు కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జంగా రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మహేందర్ యాదవ్,హరిచంద్రా రెడ్డి, రఘువీర్‌రెడ్డి, అశ్విన్ రెడ్డి, నర్సింహాగౌడ్ పాల్గొన్నారు.

సిఎం రేవంత్‌రెడ్డి హిందువులకు క్షమాపణ చెప్పాలి

సైదాబాద్‌లో నిరసన తెలుపుతున్న బిజెపి నాయకులు

సైదాబాద్, డిసెంబరు 3 ప్రభాతవార్త: భాగ్యనగర్ జిల్లా బిజెపి ఆధ్వర్యంలో సైదాబాద్ మెయిన్ రోడ్డుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, బిజెపి జిల్లా నాయకులు జంగం మధుకర్‌రెడ్డిలు మాట్లాడుతూ హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యాలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న బిజెపి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని సైదాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఉప్పల్‌లో ఘనంగా వికలాంగుల దినోత్సవ వేడుకలు

ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో వికలాంగులకు బహుమతులు అందజేస్తున్న కమిషనర్ జి.రాజు, ఎఎంసి సంగీత తదితరులు

ఉప్పల్, డిసెంబరు 3 ప్రభాతవార్త : ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం